మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల/నారాయణపేట

# తేమ, మట్టి ఉండొద్దు

## నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి .. హన్వాడలో ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్



ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 21 ప్రభాతవార్త:** నిర్ణీత తేమ,తాలు,మట్టి లేకుండా నాణ్యతా ప్రమాణాలు ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి అన్నారు. హన్వాడ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పిఎసిఎస్) ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం తనిఖీ చేశారు.కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా తెలుసుకున్నారు.ధాన్యం తేమ శాతంను పరీక్షించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం వివరాలు,ట్యాబ్ ఎంట్రీ గురించి కలెక్టర్ అడిగారు. ఇప్పుడు 2514 బస్తాల ధాన్యం ఉంది.ట్యాబ్ ఎంట్రీ 1566 బస్తాలకు పూర్తి అయిందని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తెలిపారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని తూకం వేసిన వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. రవాణా పరంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, కొనుగోలు తర్వాత కేంద్రం నిర్వాహకులదే బాధ్యత అని,రైతులు మిల్లుకు వెళ్ళే అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్ లను వినియోగించుకుంటున్నారా? అని కలెక్టర్ అడిగారు. ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్‌లకు కొద్దిగా రిపేరింగ్ చేయాల్సి ఉందని కేంద్రం ఇంచార్జి తెలుపగా ఆటోమేటిక్ ప్యాడి క్లీనింగ్ పరిశీలించి వెంటనే రిపేరింగ్ చేయించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్‌డిఓ నవీన్ తదితరులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

## చిత్తడి నేలల జాబితాను
# సిద్ధం చేయాలి

### నారాయణ పేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణ పేట, నవంబరు 21 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో చిత్తడి నేలల (వెట్‌ల్యాండ్స్) పూర్తి జాబితాను త్వరితగతిన సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా తడి భూముల కమిటీ సమావేశంలో మాట్లాడిన ఆమె, చిత్తడి నేలల సంరక్షణ మరియు నిర్వహణ నియమాలు–2017 ప్రకారం నోటిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. నోటిఫికేషన్ తేదీ నుండి మూడు నెలల్లో ప్రాథమిక జాబితా, ఆరు నెలల్లో తుది జాబితా సిద్ధం చేసి సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఒక సంవత్సరంలోపు చిత్తడి నేలల డిజిటల్ రిజిస్టర్ పూర్తి కావాలని ఆమె పేర్కొన్నారు. నోటిఫై చేయబడిన తడి భూములకు అనుమతించాల్సిన, నిషేధించాల్సిన కార్యకలాపాల జాబితాను కమిటీ సిద్ధం చేయాల్సి ఉంటుందని తెలిపారు. చిత్తడి నేలల ప్రభావిత జోన్‌లలో పర్యావరణ పరిరక్షణ చర్యలు బలపరచాల్సి ఉందని కలెక్టర్ సూచించారు. ప్రతి తడి భూమికి సమగ్ర నిర్వహణ ప్రణాళిక తయారు చేసి సమీక్షి ంచాల్సిన అవసరాన్ని ఆమె హితవు చేశారు. హైదరాబాద్ ప్రధాన అటవీ సంరక్షణాధికారి సూచనల మేరకు జిల్లా తడి భూముల కమిటీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా అటవీ అధికారి కన్వీనర్‌గా, అదనపు కలెక్టర్లు, వ్యవసాయ, రేవెన్యూ, మత్స్య, పంచాయతీరాజ్, నీటి పారుదల శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, అటవీ శాఖ అధికారి ప్రసాద్ రెడ్డి, వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, మత్స్యశాఖ అధికారి రహమాన్, పంచాయతీరాజ్ అధికారి సుధాకర్ రెడ్డి, నీటి పారుదల శాఖ అధికారి బ్రహ్మానంద రెడ్డి పాల్గొన్నారు.

# 50 పాఠశాలలు 150 విద్యార్థులు

## తపోవనంలో కఠోర దీక్ష ఎమ్మెల్యే యెన్నం దూర దృష్టి



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

- నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ కొరకు శిక్షణ
- మహబూబ్‌నగర్ ఫస్ట్, వందేమాతరం ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహణ
- నేటితో ముగియనున్న కార్యక్రమం




తపోవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం (ఫైల్)

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 21 ప్రభాతవార్త:** 50 పాఠశాలల నుండి 150 మంది విద్యార్థులు కఠోర దీక్షకు పూనుకున్నారు. వారంతా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ టెస్ట్ (ఎన్ఎంఎంఎస్)లో ఎంపిక అయ్యేందుకు శిక్షణలో నిమగ్నమయ్యారు. ఎమ్మెల్యే యెన్నం సహకారంతో మహబూబ్ నగర్ ఫస్ట్, వందేమాతరం ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న జడ్చర్లలోని గొల్లపల్లిలోని లలితాంబిక తపోవనం లో వేదికగా పొందిన శిక్షణ నేటితో ముగియనున్నది.

### స్కాలర్షిప్ కు ఎంపికైతే..

ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్ కు విద్యార్థులు ఎంపిక అయితే వారి ఉన్నత చదువులకు ఆసరాగా ఉంటుందని కొంత ఆర్థిక సాయం అందుతుందనే సదుద్దేశంతో ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్కాలర్ షిప్‌కు ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 4 సంవత్సరాలు , సంవత్సరానికి రూ. 12000 చొప్పున స్కాలర్షిప్ అందుతుంది. ఈ నెల 23న రాష్ట్రవ్యాప్తంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష మెంటల్ ఎబిలిటీ 90 మార్కులు,సోషల్ స్టడీస్‌కు 35 మార్కులు, మ్యాథ్స్ 20, ఫిజికల్ సైన్స్ 23, బయోసైన్స్ 12 మార్కులు మొత్తం 180 మార్కులకు పరీక్ష నిర్వహించనున్నారు. ఈ శిక్షణ వల్ల భవిష్యత్తులో జరిగే బ్యాంకింగ్, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ వంటి అన్ని పోటీ పరీక్షలకు చాలా ఉపయోగపడుతుంది.

### పది రోజుల శిక్షణ..

జడ్చర్ల సమీపంలోని గొల్లపల్లిలోని లలితాంబిక తపోవనం లో రెసిడెన్షియల్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. 8 వ తరగతి విద్యార్థులకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ టెస్ట్ కొరకు మహబూబ్ నగర్ శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. మహబూబ్నగర్ జిల్లాలోని 50 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. తపోవనంలోనే విద్యార్థులకు టిఫిన్, స్నాక్స్ తో పాటు ప్రత్యేక వసతులు కల్పించారు.

### నేను స్కాలర్‌షిప్ సాధిస్తా..



నేను జడ్పిహెచ్ఎస్ ఎదిరా పాఠశాలలో చదువుతున్నాను ఎన్ఎంఎంఎస్ శిక్షణ క్యాంపు నాకు చాలా ఉపయోగపడింది నేను మెంటల్ ఎబిలిటీ లో చాలా బాగా చేశాను ప్రతిరోజు కూడా టాప్ టెన్‌లో ఉన్నాను. మిగిలిన సోషల్ స్టడీస్ బయోసైన్స్ ఫిజికల్ సైన్స్‌లో వెనుకబడి ఉన్న ఇక్కడికి రావడం వల్ల ఇక్కడ చెప్పిన ఉపాధ్యాయులు చాలా చక్కగా చెప్పడం వల్ల వాటిని కూడా కవర్ చేసుకోగలిగాను కచ్చితంగా నేను స్కాలర్షిప్ సాధిస్తాను.

– ఈశ్వర్ ప్రసాద్, ఎదిర

### శిక్షణ ఎంతో ఉపయోగం



నేను కొనపాలమూరు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. నేను ఇక్కడికి వచ్చిన తర్వాత ప్రతి రోజు 2 పరీక్షలు రాస్తున్నాఈను దానిలో చేసిన తప్పులను వెంబడే మా టీచర్స్‌తో సరిదిద్దుకుంటున్నాను. రోజు వారి ఒకే సబ్జెక్ట్ నేర్చుకోవడం వల్ల పూర్తి స్థాయిలో సబ్జెక్టు నేర్చుకో గలుగుతున్నాను. శిక్షణ నాకు ఎంతో ఉపయోగపడింది. ఈ శిక్షణను ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.

– అమీనా మలీహా, కొనపాలమూర్

### సౌకర్యాలు కల్పించాం..



విద్యార్థులకు ఉదయం వేడినీళ్లతో పాటు అల్పాహారం మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం రాత్రి భోజనాన్ని పూర్తిస్థాయిలో అందివ్వడానికి ప్రయత్నం చేశాం. భక్తులు ఇచ్చిన కానుకల ద్వారానే ప్రతి సంవత్సరం విహారయాత్రకు వెళ్లే సుమారు 35,000 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నాను. ఎన్ఎంఎంఎస్ శిక్షణకు వచ్చిన 150 మంది విద్యార్థులకు ఆలయ అభివృద్ధి కమిటీ తరఫున వారికి పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాము.

– గుమ్మడవలి భాస్కర్, తపోవనం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు

# ముంపు బాధితులకు అండగా ప్రభుత్వం

- రైతుల పంటనష్టంపై వెంటనే చర్యలు
- ప్రతి కుటుంబానికి న్యాయం జరిగే విధంగా చర్యలు
- నాగర్‌కర్నూలు కలెక్టర్ బదావత్ సంతోష్



పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 21 ప్రభాతవార్త:** ముంపు బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. శుక్రవారం అచ్చంపేట మండల పరిధిలోని మర్లపాడు తండా గ్రామాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,అదనపు కలెక్టర్ పి.అమరేందర్, అధికారులతో కలిసి సందర్శించి గ్రామ ప్రజలతో సమావేశమయ్యారు. నక్కలగండి ప్రాజెక్టు ముంపు ప్రభావానికి గురయ్యే నక్కలగండి తండా, మర్లపాడు తండా, కేశ్య తండా, మన్నేవారిపల్లి గ్రామాల ప్రజలకు పునరావాసం మరియు పునర్నిర్మాణం ప్రక్రియను వేగవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రకటించారు. ముంపు ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించిన కలెక్టర్, అక్కడి ప్రజలతో సమావేశమై వారి అవసరాలు, అభిప్రాయాలు, పునరావాసంపై ఉన్న సందేహాలను వివరంగా తెలుసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గారి ప్రత్యక్ష ఆదేశాల మేరకు తాము ఈ ప్రాంతానికి వచ్చి ముంపు ప్రభావం, పునరావాస పనులు, పంట నష్టాలను పరిశీలిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వానికి ప్రజల సంక్షేమమే ముఖ్యమని, ముఖ్యమంత్రి సూచనల ప్రకారం ప్రతి కుటుంబం, ప్రతి రైతు, ప్రతి తండాకు న్యాయం జరిగేలా యంత్రాంగం పనిచేస్తుందని గ్రామస్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తండాల్లో నివసిస్తున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వంతో నిరంతరం చర్చలు జరిపి, తమ పరిధిలో చేయాల్సిన పనులను ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పూర్తిగా అమలు చేస్తానని హామీ ఇచ్చారు. పునరావాసానికి సంబంధించిన ప్రతీ పని పారదర్శకంగా,వేగంగా జరిగేలా స్వయంగా పర్యవేక్షిస్తానని తెలిపారు. ప్రజలు ప్రధానంగా తమ భవిష్యత్ నివాస స్థలం సౌకర్యాలతో ఉండాలని, పునరావాస చర్యలు ఆలస్యం కాకూడదని,విద్య,ఆరోగ్య,రవాణా వంటి మౌలిక వసతులు సమీపంలో ఉండాలని కోరినట్లు పేర్కొన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ప్రతీ అర్హుడికి తప్పకుండా వర్తించే విధంగా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజల కోరికలకు అనుగుణంగా అనువైన స్థలాన్ని ఎంపిక చేయడానికి ప్రభుత్వం అందుబాటులో ఉన్న భూములను పరిశీలిస్తోందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుత ప్రాంతంలో సరిపడ ప్రభుత్వ భూమి అందుబాటులో లేకుంటే, అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ వద్ద ఇప్పటికే గుర్తించిన ప్రత్యామ్నాయ భూమిలో పూర్తిస్థాయి పునరావాసకాలనీలను నిర్మించడానికి యంత్రాంగం సిద్ధంగాఉందని హామీ ఇచ్చారు. ఈ పునరావాస కాలనీలు కేవలం ఇండ్లనిర్మాణం మాత్రమేకాకుండా,నీటిసౌకర్యం,విద్యుత్,అంతర్గత రహదారులు, డ్రెయినేజ్‌వ్యవస్థ,స్ట్రీట్ లైటింగ్, కమ్యూనిటీ హాల్స్ వంటి అన్ని మౌళిక వసతులతో రూపుదిద్దుకునేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇందుకోసం భూ సర్వే పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, నిర్మాణాల రూపకల్పన సిద్ధం అవుతోందని, సంబంధిత నిర్మాణ సంస్థలతో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. పునరావాసానికి సంబంధించి మరిన్ని సదుపాయాలను కల్పించేందుకు ప్రత్యేక నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నామని చెప్పారు. పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, తాగునీటి పథకాలు వంటి సేవలను కూడా కొత్త కాలనీల్లో ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. నక్కలగండి ప్రాజెక్టు నుండి విడుదలైన నీటి ప్రవాహం మరియు ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాల ప్రభావాన్ని కూడా కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. పత్తి, వరి వంటి ముఖ్య పంటలు పెద్దఎత్తున తడిసి దెబ్బతిన్న ప్రాంతాలను సందర్శించి, రైతులతో మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న నష్టాల స్థాయిని సమగ్రంగా అంచనా వేసి, రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి వివరాలతో నివేదికలు పంపినట్లు కలెక్టర్ తెలిపారు. పంట నష్టం వల్ల రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకునే చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. నష్టపోయిన పంటలకు పంటనష్టం పరిహారం అందేలా ప్రత్యేక నివేదికలు పంపించామని, రైతులకు తక్షణ ఉపశమనం కలిగించే చర్యలను ప్రభుత్వం త్వరగా అమలు చేస్తుందనే, వర్షాలు, వరదలతో ప్రభావితమైన ప్రతి రైతుకూ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. వ్యక్తిగత వ్యాపారాలు, చిన్న వ్యాపారాల వల్ల నష్టపోయిన వారు కూడా స్వయంగా వచ్చి తమ సమస్యలను వివరించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్డీవో మాధవి, అచ్చంపేట తాహసిల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు ఆయా ముంపు గ్రామాల ప్రజలు తదితరులు ఉన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

## మహిళల భద్రత
# మా బాధ్యత

### ఎస్పీ జానకీ ధరావత్

**మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో బాలికలతో మాటా-ముచ్చట**

**హెల్ప్‌లైన్ నంబర్ల పంపిణీ, షీ టీమ్ పోస్టర్ల విడుదల**

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 21 ప్రభాతవార్త:** ప్రజా భద్రత – పోలీసు బాధ్యత" అని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి తరావత్ అన్నారు. జిల్లా ఎస్పీ డి.జానకి మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో విద్యార్థులతో మాట్లాడారు. వారిని ఆప్యాయంగా పలకరిస్తూ భరోసానిచ్చారు. స్కూల్, కళాశాలలు ముగిసే సమయానికి బస్టాండ్‌లో ఎక్కువగా బాలికలు, మహిళలు ప్రయాణాలు చేసే కారణంగా వారిని ఏమైనా ఇబ్బందులు పెడుతున్నారా అనే దానిని నేరుగా తెలుసుకునేందుకు – మిగతా4లో..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం, పక్కన గోనెల శ్రీనివాసులు

## మత్స్యకారుల సంక్షేమానికి
# కట్టుబడి ఉన్నాం

### వారికి భద్రత, ఆదాయం కల్పిస్తాం

### పిల్లల ఉన్నత చదువులకు అవకాశాలు కల్పిస్తున్నాం

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 21 ప్రభాతవార్త:** మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారి జీవన స్థితిగతులను మెరుగుపరచడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, మత్స్యకారుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రపంచ – మిగతా4లో..

# కోటి మంది మహిళలకు చీరలు..

## ప్రతి మహిళా సంఘం సభ్యులకు ఉచితంగా చీర.. వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి, నవంబరు 21 ప్రభాతవార్త :** ఉక్కు మహిళా, మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ 108వ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రంలోని మహిళలకు సారె ఇవ్వాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి కోటి మంది మహిళలకు కోటి చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టిందని స్థానిక శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లాలో చీరల పంపిణీ కార్యక్రమం పెద్దమందడి మండలంలో ప్రారంభించగా శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో 15 మండలాలు ఉండగా మొదటగా తన స్వంత మండలం పెద్దమందడిలో ప్రారంభ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని గ్రామీణ మహిళా సంఘాల సభ్యులకు 89 వేల పైచిలుకు చీరలు వచ్చాయని, మున్సిపాలిటీలకు మరో 40 వేల చీరలు వస్తాయని తెలిపారు.18 సంవత్సరాల వయస్సు దాటిన ప్రతి మహిళా సంఘం సభ్యులకు ఉచితంగా ఒక చీర ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళకు ఇస్తున్న చీరలు చాలా నాణ్యమైనవని, రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుండి మహిళలు ఏదైనా పని మీద వనపర్తి పట్టణానికి వస్తే సేద తీరడానికి, మహిళల సమస్యలపై చర్చించుకోడానికి రూ.5 కోట్ల వ్యయంతో జిల్లా మహిళా సమాఖ్య భవనం నిర్మాణంలో ఉన్నట్లు తెలిపారు. త్వరలోనే ప్రారంభోత్సవం చేసుకోవడం జరుగుతుంది. నియోజకవర్గంలోని ప్రతి మండలానికి, గ్రామానికి రోడ్లు, సీసీ రోడ్లు వేయించడమే కాకుండా అన్ని విధాలైన అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు.జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రతి ఒక మహిళకు ఉచిత చీర ఇవ్వడం చాలా సంతోషం కలిగిస్తుందన్నారు. జిల్లాలో మహిళా సంఘం సభ్యులు ప్రతి ఒక్కరికి చీర ఇవ్వడం జరుగుతుందని, సంఘంలో లేని మహిళలను సైతం సంఘంలో చేర్చుకొని చీర ఇవ్వడం జరుగుతుందన్నారు. బ్యాంకు రుణాలు మహిళా సంఘం సభ్యులు చాలా చక్కగా బాధ్యతతో తిరిగి చెల్లిస్తారని, అందుకే ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు అయి ఇళ్ల కట్టుకోడానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నవారికి మహిళా సంఘం ద్వారా బ్యాంకు రుణం ఇప్పించడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటివరకు జిల్లాలో 105 మంది మహిళలకు ఇందిరమ్మ ఇల్లు కట్టుకోడానికి రుణాలు ఇప్పించినట్లు తెలిపారు. ఇంకా ఎవరికైనా అవసరం ఉంటే సంఘం సభ్యులు ఇప్పించాలని సూచించారు. మహిళా సంఘాలకు పెబ్బేరులో పెట్రోల్ బంక్, మహిళా సమాఖ్య భవనం త్వరలో పూర్తి కానున్నట్లు తెలిపారు.

### గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవం

పెద్దమందడి మండలం, జగత్ పల్లి గ్రామ పంచాయతీలో జాతీయ ఉపాధి హామీ నిధులు రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని శాసన సభ్యులు , జిల్లా కలెక్టర్ ప్రారంభోత్సవం చేశారు.

### రోడ్డు పనులకు భూమి పూజ

రాష్ట్ర ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి వనపర్తి జిల్లా పర్యటన సందర్భంగా రాజనగరం నుండి పెద్దమందడి వరకు రూ.40కోట్ల వ్యయంతో మంజూరు చేసిన రెండు వరుసల రోడ్డు కు శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్‌తో కలిసి భూమి పూజ చేశారు. రోడ్డు పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టి సాధ్యమైనంత త్వరగా రోడ్డు పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ బి శ్రీనివాస్ గౌడ్, అడిషనల్ డిఆర్‌డిఓ సరోజ, తహసిల్దార్ పాండు ఎంపీడీవో పరిణత, జిల్లా మహిళా సమాఖ్య చైర్మన్ స్వరూప, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గట్టన్న, వెంకటస్వామి, ఐ.సత్యారెడ్డి, రఘు ప్రసాద్, ఎపియం సక్రూ నాయక్, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### పీర్లగుట్టపై కమ్యూనికేషన్ రిపీటర్ భవనం....

వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి ఆధునిక –మిగతా4లో..

## మత్స్య సంపదను ఐక్యతతో కాపాడుకోవాలి

**మత్స్యకారుల దినోత్సవంలో గంగపుత్ర సంఘం**

**నవాబుపేట,నవంబరు 21 ప్రభాతవార్త :** ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బెస్త గంగ పుత్ర సంఘం ఆధ్వర్యంలో మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గౌరవ అధ్యక్షులు, ముఖ్యులు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న మత్స్యకారులందరు ఐక్యంగా ఉండాలని తమ సంప్రదాయ వృత్తులను కాపాడుకొని, జలవనరులు మత్స్య సంపదను కాపాడుకోవాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అంజయ్య, గౌరవ అధ్యక్షులు వేణు గోపాల్, ప్రధాన కార్యదర్శి నరేందర్, నరసింహ, పలేల యాదయ్య, దివిటి నర్సింలు, అల్లే వెంకటేష్, జంగయ్య, నర్సింలు, వెంకట్, నారాయణ, రామస్వామి, రాములు, బుచ్చయ్య, అంజటి యాదయ్య, శంకరయ్య, వెంకటేష్, అఖిల్, నరేష్, దొర్లాలి శివ, శివశంకర్,నవీన్ మొదలగు సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మత్స్యకారుల దినోత్సవంలో గంగపుత్రులు

## నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం

**వడ్డేపల్లి, నవంబరు 21 ప్రభాతవార్త :** ప్రొ॥ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా చేపట్టిన గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వడ్డేపల్లి మండలం పైపాడు గ్రామంలో ఆర్‌ఎన్‌ఆర్ 15048 వరి రకం క్షేత్ర దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డా.ఏ.శంకర్ మాట్లాడుతూ నాణ్యమైన విత్తనం రైతు స్థాయిలో విత్తనోత్పత్తి పెంపొందించే ఉద్దేశంతో జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విద్యాలయం, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమం నిర్వహించి దానిలో భాగంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం వారు జోగులాంబ గద్వాల జిల్లాలో వరి, జొన్న కిట్లను ఇవ్వడం గురించి చెప్తూ విత్తనోత్పత్తి చేసినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువల గురించి వివరించారు. ఆర్ఎన్ఆర్ 15048 వరి రకం, వాటి లక్షణాలు తెలియజేశారు. విత్తనోత్పత్తి చేసిన రైతులు తప్పకుండా తనతో పాటు ఇతర రైతులకు కూడా ఈ విత్తనాన్ని అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో డా.ఎమ్.శంకర్ డా. ఏ. శ్రీరామ్, డా.ఆదిశంకర్, డా.కె సిద్దప్ప, వ్యవసాయ విస్తరణ అధికారులు జి.రవీందర్ రెడ్డి, చంద్రకళ, కె.విమల, సి.వినోద్‌లు పాల్గొన్నారు.



పైపాడు గ్రామంలో ఆర్ఎన్ఆర్ 15048 వరి రకం క్షేత్ర దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

## అండర్ 19 విభాగంలో
## జిల్లాస్థాయి క్రికెట్ పోటీలోకి సర్గం మహేష్

**అభినందించిన పుడమి ఫౌండేషన్ చైర్మన్ వెంకటపతిరాజు**

**మక్తల్‌టౌన్,నవంబరు 21 ప్రభాతవార్త :** చిన్న ప్పటినుండి క్రికెట్‌పై ఉన్నటువంటి మక్కు వతో చురుకుగా వ్యాయామం చేయడంతో పా టు క్రికెట్లో అత్యున్నత ప్రతిఫలం కనపరచడం చూసి గౌడ్ ట్రైనింగ్ తీసుకొని రాష్ట్రస్థాయిలో అండర్ 19 క్రికెట్‌కు సెలెక్ట్ కావడం జరిగింది. స్కాలర్ జూనియర్స్ కాలేజీలో చదువుకుం టూ ఆత్రుత ప్రతిభను కనపరిచిన మహేష్ ను పుడమి ఫౌండేషన్ చైర్మన్ వెంకటపతి రాజు శాలువాతో సన్మానించడం జరిగింది. వెంకటపతి రాజు మాట్లాడుతూ పేద అట్టడుగు వర్గాల విద్యార్థులు విద్యారంగంతో పాటు క్రీడల్లో కూడా మంచి ప్రావిణ్యతను సాధించి అత్యున్నత స్థాయికి ఎదగాలని అన్నారు.. మక్తల్ పట్టణానికి చెందిన మహేష్ దేశానికే ప్రాతినిధ్యం వహించాలని ఆశిస్తూ, కష్టపడి మరింత ముందుకు వెళ్లాలని కోరారు. ఈ క్రమంలో మహేష్ కు పుడమి ఫౌండేషన్ వెన్నుదన్నుగా ఉంటుందని తెలియజేశారు. పుడమి ఫౌండేషన్ ఈ.సి మెంబర్ ప్యాట పవన్ కళ్యాణ్, కడెచర్ ఆంజనేయులు, శ్రీను, ఎల్లలింగ తదితరులు పాల్గొన్నారు.



మహేష్‌ను అభినందిస్తున్న దృశ్యం

## దుందుభి వాగు నుంచి
## ఇసుకను తోడేయడం నిలిపి వేయాలి

**తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన బిఎస్పీ నాయకులు**

**ఉప్పునుంతల, నవంబరు 21 ప్రభాతవార్త :** మండలంలో ప్రవహిస్తున్న దుందుభి వాగు నుంచి తరలిస్తున్న ఇసుకను వెంటనే నిలిపి వేయాలని శుక్రవారం స్థానిక తహసిల్దార్ అద్దంకి సునీత కు బీఎస్పీ నాయకులు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం మండలంలో ని దుందుభి వాగు రీచ్‌లను పరిశీలించారు. అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారని సత్వరమే అక్రమ రవాణాను నిలిపి వేయాలంటూ వారు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్‌కు అందజేశారు. దుందుభి వాగు పరిసర ప్రాంతాలలో పట్టా పొలాలు ఉన్నాయని ఇసుక ను రాత్రింబవళ్లు తోడేస్తున్నారని వెంటనే నిలిపివేయాలని వారు తహసీల్దార్‌కు విన్నవించుకున్నారు. తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన వారిలో అచ్చంపేట అసెంబ్లీ ఇంఛార్జి ఉల్పర కృపానందం, జిల్లా ఇంఛార్జి కళ్యాణ్, మాజీ రాష్ట్ర ఈసీ నెంబర్ పృథ్వీరాజ్, బీఎస్పీ అచ్చంపేట అసెంబ్లీ నాయకులు కుందేటి రవి, మడుపు నాగేష్, హర్ష, శ్రీను, శేషు, సాయి, నాగరాజు, రామ్ చందర్, రామకృష్ణ, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

## డ్రగ్స్ వల్ల యువత భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతోంది

**నారాయణపేట,నవంబరు 21 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నషా ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమంలో ఎస్పీ వినీత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రగ్స్ అనే మహమ్మారి యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి యువకుడు యాంటి డ్రగ్ సోల్జర్గా బాధ్యత తీసుకుని ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. నార్కోటిక్ డ్రగ్స్ అనేవి సమాజాన్ని లోపల నుంచి దెబ్బతీసే ఉగ్రవాదం లాంటివని ఇవి కుటుంబాలను భవిష్యత్తులను నాశనం చేస్తాయని స్పష్టం చేశారు. డ్రగ్స్ సమస్యను నిర్మూలించేందుకు ప్రతి పౌరుడు,తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేయాలని సూచించారు. గంజాయి,డ్రగ్స్ అక్రమ రవాణా,విక్రయం లేదా వినియోగం ఎక్కడైనా గమనించిన వెంటనే 1908 టోల్ ఫ్రీ నెంబర్ లేదా డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ ప్రొ॥ రాజశేఖర్, సీఐ శివశంకర్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, సునీత, భజరంగ్ దళ్ జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్, అధ్యక్షుడు వడ్ల శ్రవణ్, నగర అధ్యక్షుడు మురళి బట్టడ్, నరేష్, వెంకటరమణ, వెంకటేష్, ఆకాష్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ తదితరులు

## ఆత్మకూరులో రక్తదాన శిబిరం విజయవంతం

**ఆత్మకూరు నవంబర్ 21, ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని సాయిబాబా దేవాలయ ప్రాంగణ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైనట్లుగా నిర్వాహకులు శ్రీధర్ జోషి తెలిపారు. గడచిన మూడు రోజులుగా పట్టణంలోని వివిధ గ్రామాలలో కొనసాగుతున్న పుట్టపర్తి సాయిబాబా శత జయంతి ఉత్సవాల పురస్కరించుకొని ఆత్మకూరు పట్టణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి సాయిబాబా భక్తులు అధిక సంఖ్యలో హాజరై రక్తదాన శిబిరం విజయవంతం చేశారని వనపర్తి వైద్య బృందం చేత దత్తదాన శిబిరం ఏర్పాటు చేయగా 16 మంది భక్తులు రక్తదానం చేసినట్లుగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన సాయిబాబా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న సాయిబాబా భక్తులు

### యువత బాధ్యతాయుత ప్రవర్తన,భవిష్యత్తు

# వంటి అంశాలపై ప్రత్యేక కౌన్సిలింగ్

**56 మంది యువకులకు కౌన్సిలింగ్ : జిల్లా ఎస్పీ డా వినీత్**

**నారాయణ పేట, నవంబరు 21 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా ఎస్పీ డా. వినీత్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ శాఖ పరిధి లో రాత్రి ఆపరేషన్ చపుత్రను లోకల్ పోలీసులు ప్రత్యేక దళాలు సమన్వయంతో చేపట్టారు. కాలనీలు,హోటళ్లు,షాపుల ముందు, పబ్లిక్ ప్రదేశాల్లో అనుమానాస్పదంగా గుమికూడి యువతీ, మహిళలకు అసౌకర్యం కలిగిస్తూ తిరుగుతున్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇందులో పేట నుండి 26, మక్తల్ నుండి 18, మరికల్ నుంచి 07, కోస్గి నుండి 05 మంది మొత్తం 56 మంది యువకులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. తరువాత వారందరికీ మహిళల పట్ల గౌరవం,ఈవ్ టీజింగ్-హరాస్మెంట్‌పై చట్టపరమైన శిక్షలు, యువత బాధ్యతాయుత ప్రవర్తన,భవిష్యత్తుపై దాని ప్రభావం వంటి అంశాలపై ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారి తల్లిదండ్రులను కూడా పిలిపించి అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఎస్పీ డా. వినీత్ మాట్లాడుతూ యువతే భావితరాలకు మార్గదర్శకులని,అయితే కొద్ది మంది యువత అర్ధరాత్రి వరకు వీధుల్లో తిరుగుతూ అనుచిత ప్రవర్తనతో తమ విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటేనే భవిష్యత్తు వెలుగులు కనిపిస్తాయని,లేకపోతే అంధకారం తప్పదని అన్నారు. సమాజంలో మార్పు తేవాలంటే యువత బాధ్యతాయుతంగా నడుచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలో మళ్లీ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. మహిళల భద్రత తమ మొదటి ప్రాధాన్యత అని, ఎవరి నుంచైనా వేధింపులు జరిగితే క్షమించరని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిశితంగా గమనించాల్సిన అవసరం ఉందన్నారు.



యువకులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకే చెకుముఖి

**చెకుముఖి సైన్స్ పోటీలలో విజేతలుగా తపోవన్ పాఠశాల జట్టు: దేవరకద్ర ఎంఈఓ బలరాం**

**దేవరకద్ర, నవంబరు 21 ప్రభాతవార్త:** పాఠశాల స్థాయిలో విద్యార్థుల ప్రతిభ గుర్తించేందుకే చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బలరాం తెలిపారు. శుక్రవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దేవరకద్ర మండల కేంద్రంలోని స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి చెకుముకి సైన్స్ పోటీలలో తపోవన్ పాఠశాల విద్యార్థుల జట్టు విజేతలుగా నిలిచారు. చెకుముకి సైన్స్ పోటీలలో తపోవన్ విద్యార్థుల జట్టు ఎనిమిదో తరగతి నుండి దీక్షిత, 9వ తరగతి నుండి సాత్విక్ రాఘవ్, పదవ తరగతి నుండి చేతన్ రెడ్డి మండల స్థాయి నుండి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. గెలుపొందిన విద్యార్థులకు మండల విద్యాధికారి బలరాం, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామలింగం, చెకుముకి సైన్స్ పోటీల నిర్వాహకులు వేణుగోపాల్ చేతుల మీదుగా, ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం తపోవన్ పాఠశాల ప్రిన్సిపల్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయిలో పోటీ పరీక్షల్లో పాల్గొంటే, భవిష్యత్తులో పోటీ పరీక్షలపై భయం ఉండదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రయ్య, నరసింహులు, రవి, శ్రీనివాసులు, ఇక్బాల్ పాషా, తిరుపతయ్య, కురుమూర్తి, స్వామి, నాగరాజు, అనురాధ, సబిహ బేగం, ఉమా, పావని, సరిత, అనిత, భవాని, స్వప్న, శిరీష, కరిష్మా, మౌనిక, లత, గౌతమి, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

## జిల్లా స్థాయి బాలికల అండర్ 14 ఖోఖో పోటీలు

**మక్తల్ టౌన్, నవంబరు 21 ప్రభాతవార్త:** మక్తల్ మండలం కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 21న నిర్వహణ కార్యదర్శి పిడి బి.రూప ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా స్థాయి 14 సంవత్సరాల లోపు స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలను, జిల్లా స్కూల్ గేమ్ సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ గౌడ్, బి.గోపాలం బాల బాలికలను పరిచయం చేసుకొని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందని సమాజంలో గౌరవం ఉంటుందని సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలియజేస్తూ, ఈ జిల్లా స్థాయిలో రాణించి జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక కావాలని వారు తెలిపారు. మారుమూల గ్రామమైన కర్ని పాఠశాలలో జిల్లా స్థాయి గవర్నమెంటు నిర్వహించడం అభినందనీయమని పిడి బీ.రూపను గురించి మాట్లాడారు. పాఠశాల హెచ్ఎం వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు, మల్లేశ్వరి, శివాని, శశిరేఖ, శివకుమార్ జాతి స్థాయిలో ఖోఖో, సైకిల్, షూటింగ్ బాల్ క్రీడల్లో పాల్గొన్నందులకు, అందుకు కృషిచేసిన ఫిజికల్ డైరెక్టర్ బి.రూపను, హెచ్ఎం వెంకటయ్య గౌడ్ బి.గోపాలం ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాఘవేందర్ గౌడ్, ఎంపీటీసీ రంగప్ప, దత్తురాం, డా. తిరుపతి, పాఠశాల ఉపాధ్యాయ బృందము పీడీలు, పీఈటీలు సాయినాథ్ వెంకటప్ప, నర్సింలు, వెంకటేష్, మీనా కుమారి, రేణుక, సౌమ్య, స్వరూప, రాజేశ్వరి, చంద్రకళ, అనిత, జిల్లాలోని 13 మండలాల పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఖోఖో పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

## చట్టబద్ధతతో కూడిన రిజర్వేషన్లు అమలు చేయాలి

**బిజినేపల్లి, నవంబరు 21 ప్రభాతవార్త :** ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడానికి కృషి చేయాలని బీసీ రాష్ట్ర నాయకులు డా. శివార్చక విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పూలే అంబేద్కర్ చౌరస్తాలో బీసీ సంఘం ఆధ్వర్యంలో నల్ల కండువాలతో, ప్ల కార్డులతో నిరసన తెలియజేశా రు. రాష్ట్ర నాయకులు డా. శివార్చక విజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పార్టీపరంగా రిజర్వేషన్లు అమలు చేయవద్దని చట్టబద్ధంగా రాజ్యాంగపరంగా తొమ్మిదో షెడ్యూల్లో పెట్టి విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు ఇయ్యాలని, రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షంతో సమావేశం ఏర్పాటు చేసి శీతాకాలంలో జరిగే పార్లమెంటు సమావేశంలో కేంద్ర ప్రభుత్వంతో చర్చించి పార్లమెంటులో బిల్లును ఆమోదించే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రం అగ్నిగుండంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో అంతటి రాజేందర్ గౌడ్, మారేపల్లి శంకర్ గౌడ్, భగవంతు గౌడ్, వంగ రామన్ గౌడ్, వేముల తిరుపతయ్య, అంతటి నాగన్న, అబ్బ కర్ణాకర్, నరేందర్ గౌడ్, రఘు బాబు, వేముల శ్రీనివాసులు, మేకల యాదయ్య, పద్మ శ్రీశైలం, బెక్కరి శివ, ఆవుల కృష్ణ, అనిల్ గౌడ్, ఎండి, జహంగీర్, అజీజు, సట్ల బాలరాజు, సురేషు, మంగంపేట శ్రీనివాసులు, కుమ్మరి తిరుమల్, పట్నం శంకర్, డా. తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీసీ సంఘం నాయకులు

## భవన కార్మికులకు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేయాలి

**ఆత్మకూర్ నవంబర్ 21, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాపితంగా ఉన్నటువంటి భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ రాజు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ తదితరులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో పనులు కొనసాగిస్తున్న భవన నిర్మాణ కార్మికుల దగ్గరకు వెళ్లి సిఐటి ఆధ్వర్యంలో భవనిర్మాణ కార్మిక స్థితిగతులపై సర్వే నిర్వహిస్తున్నట్లుగా వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన 346 కోట్ల నిధులను వెల్ఫేర్ బోర్డుకు బదిలీ చేసి కార్మికుల పొట్ట కొడుతుందని వారు తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఇప్పటికే భవన కార్మికులకు 12 రకాల సంక్షేమ పథకాలు అందజేయాల్సి ఉన్నప్పటికీ కేవలం నాలుగు ఇంటిని మాత్రమే అమలు చేస్తూ అటు ప్రభుత్వ పెద్దలు ఇటు కార్మిక శాఖ అధికారులు కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.దేశవ్యాప్తంగా ఉన్నటువంటి భవన నిర్మాణ కార్మికులను ఆదుకునేందుకు సిఐటి ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో సర్వేలు కొనసాగించి నివేదికలను తమ శాఖల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసినట్లుగా వారు తెలిపారు. అందులో భాగంగానే భవన నిర్మాణ కార్మికులు పనులు కొనసాగిస్తున్న ప్రదేశాలకు వెళ్లి సర్వే ప్రారంభిస్తున్నట్లుగా వారు తెలిపారు భవన కార్మికులకు సంబంధించిన 346 కోట్ల నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టించేందుకే వెల్ఫేర్ బోర్డు కు బదిలీ చేసిందని గతంలో కూడా బిఆర్ఎస్ ప్రభుత్వం భవన కార్మికులకు పలు పథకాలు ప్రకటించి అమలు చేయడంలో ఘోరంగా విఫలమయిందని ప్రస్తుత రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం భవన కార్మికులకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలకు పునుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు భరత్ వెంకట్ జగదీష్ తదితరులతో పాటుగా పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## వికలాంగులకు సహాయ పరికరాలు అందించాలి

**నారాయణ పేట, నవంబరు 21 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో ఎంపికైన వికలాంగుల లబ్ధిదారులకు తక్షణం సహాయ పరికరాలు పంపిణి చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ జిల్లా కలెక్టర్‌ని కోరింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు ఉచిత సహాయ పరికరాలు పంపిణి చేసేందుకు 2025 జూన్ 6న టీవీసీసీ/సి1/119/2024 నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఈ నోటిఫికేషన్‌కు జిల్లాలో వందలాది మంది వికలాంగులు దరఖాస్తులు చేసుకోగా, అందులో 160 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. వీరికి 16 రకాల సహాయ పరికరాలు అందించేందుకు నెలల కిందటే జిల్లాస్థాయి ఎంపిక పూర్తయింది. అయితే ఇప్పటికీ పరికరాల పంపిణీ జరగకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించినప్పటికీ పరికరాలు అందకపోవడం విచారకరమని కమిటీ పేర్కొంది. ఎంపికైన వికలాంగులు రోజూ పరికరాల కోసం ఎదురుచూస్తున్నందున, వెంటనే పంపిణీలు ప్రారంభించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కాశప్ప, జిల్లా ఉపాధ్యక్షులు మల్లప్ప, జిల్లా సహాయ కార్యదర్శి వి.బసవరాజ్, జిల్లా నాయకుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## రేపు ఆత్మకూర్‌కి మంత్రి రాక

**ఆత్మకూర్ నవంబర్ 21,ప్రభాతవార్త :** రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు వాకిటి చారి శనివారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణానికి వస్తున్నట్లుగా ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా ప్రభాతవార్తకు తెలిపారు. మండలంలోని బాలకృష్ణ పురం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి హాజరు అవుతున్నారని అంతేకాకుండా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో దయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తారని మున్సిపల్ కేంద్ర కార్యాలయ ఆవరణలో ఓపెన్ జిమ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లుగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఆత్మకూర్ మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శిగా సీతారాం

**చిన్నచింతకుంట, నవంబరు 21 ప్రభాతవార్త :** విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తున్న పిడిఎస్‌యు జిల్లా కార్యవర్గంలో మండల యువతకు చోటు దక్కింది. గురువారం జిల్లా కేంద్రంలో డా. బి.ఆర్ అంబేద్కర్ కళాభవనంలో నిర్వహించిన భవిష్యత్ కార్యాచరణ పై ప్రణాళికను రూపొందించుకుని 15 మందితో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు కంపటి పృథ్వి, ప్రధాన కార్యదర్శి ఎస్. అనిల్ సమక్షంలో పిడిఎస్ యు జిల్లా కార్యదర్శిగా చిన్న వడ్డెమాన్ గ్రామానికి చెందిన సీతారాంను, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బండర్‌పల్లి గ్రామానికి చెందిన కె.హర్షవర్ధన్‌ను జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగింది. పిడిఎస్‌యు జిల్లా కార్యవర్గంలో చోటు దక్కిన సీతారాం, హర్షవర్ధన్ టియుసిఐ మాజీ జిల్లా కోశాధికారి గణేష్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా ప్రపంచ
## మత్స్యకార దినోత్సవం నిర్వహణ



మత్స్యకారుల దినోత్సవం నిర్వహిస్తున్న ముదిరాజ్‌లు

**నారాయణ పేట, నవంబరు 21 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు ఏ.కాంత్ కుమార్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు సరాఫ్ నాగరాజు వారి ఆధ్వర్యంలో ఈ వేడుకలు విజయవంతంగా జరిగాయి. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు సరాఫ్ నాగరాజు ముదిరాజ్ సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించగా, మత్స్యకారులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను జరుపుకున్నారు.ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోనంగిరి హనుమంతు,పట్టణ ముదిరాజ్ యువజన నాయకులు ఏ.రాము డా.కాకర్ల భీమయ్య, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్లు శ్రీనివాస్, శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాల
## సమస్యలను పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి

**పెబ్బేరు, నవంబరు 21 ప్రభాతవార్త:** పెబ్బేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాలను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించారు. ముందుగా ప్రిన్సిపాల్స్ జయచంద్రతో సమావేశమై అవసరమైన మౌలిక సదుపాయాలు తదితర అంశాలను సమీక్షించారు. అనంతరం కళాశాలకు నీళ్ల, క్రీడా మైదానంతో, హాస్టల్ వసతులతో పాటు కళాశాల గ్రౌండ్ చుట్టూ ఫినిషింగ్ ఏర్పాటు చేయాలని తెలుపగా తక్షణమే స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డికి దృష్టికి తీసుకుపోగా పాలిటెక్నిక్ కళాశాల సమస్యలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామన్ గౌడు, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, రంగన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం
## పరిపాలన దినోత్సవం



పాఠశాలలో స్వయం పరిపాలన
దినోత్సవం జరుపుకున్న విద్యార్థినిలు

**ఆత్మకూర్ నవంబర్ 21,ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలంలోని బాలకృష్ణ పురం గ్రామ సమీపంలో గల కస్తూర్బా గాంధీ విద్యాలయంలో శుక్రవారం రోజు విద్యార్థిని విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. స్వయం పరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలల్లోని విద్యార్థినులు ఉపాధ్యాయులుగా పనిచేసే తమ ప్రతిభాపాటవలన చాటుకున్నారని పాఠశాల ప్రిన్సిపల్ స్వప్న విలేకరులకు తెలిపారు.పలువురువిద్యార్థినులు ఆయాసబ్జెక్టులలో పాఠ్యాంశాలను బోధిస్తూ విశేష ప్రతిభ కనబరిచినట్లుగా ఆమె తెలిపారు. స్వయం పరిపాలన దినోత్సవం కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల నుండి ప్రత్యేక బహుమతులు అందజేసినట్లుగా ప్రిన్సిపాల్ తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుల బృందం మమత రేణుక సబితా తదితరులతోపాటుగా పలువురు పాల్గొన్నారు.

## ఎల్‌ఓసి అందజేసిన మంత్రి వాకిటి శ్రీహరి



**మక్తల్ టౌన్, నవంబరు 21 ప్రభాతవార్త :** మక్తల్ మండలం పరేవుల గ్రామవాసి సుమిత్ర భర్త బాలస్వామి అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్సకు వైద్య సహాయం కోసం పశు సంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్య, క్రీడా మరియు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని సంప్రదించగా వారికి ముఖ్య మంత్రి సహాయనిధి కింద రూ.5 లక్షల ప్రపోజల్ ఎల్‌ఓసిని మంజూరు చేశారు. సంబంధిత ప్రపోజల్ ఎల్‌ఓసిని మంత్రి అధికారిక నివాసంలో వారికి అందచేశారు. మంచి వైద్యం అంది, బాధితుడుత్వరగా కోలుకోవాలని ఆకాంకించారు. రాష్ట్రంలోని నిరుపేద ప్రజలకి ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూఅండగానిలుస్తుంది. మీకుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఎల్లప్పుడూ ఆనందముగా ఉండాలని కోరుకుంటున్నానని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు.

## ముదిరాజులు స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

**ఖిల్లాగణపురం నవంబర్ 21, ప్రభాతవార్త:** ముదిరాజులు ఐక్యంగా ఉండి స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని జిల్లా మత్స్యకార ఉపాధ్యక్షులు అన్నవేని కృష్ణయ్య, మండల మత్స్యకారుల సంఘం అధ్యక్షులు సాయిలు అన్నారు. శుక్రవారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్బంగా మండల కేంద్రంలో మత్స్యకారుల జండా ఆవిష్కరణజరిపించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బీసీ లందరూ ఐక్యంగా ఉండి స్థానిక ఎన్నికల్లో వార్డు మెంబర్ నుంచి సర్పంచ్ ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసిగెలవాలని సూచించారు. ముదిరాజులను గతంలో బీసీఏలో చేర్చాలని సుప్రీంకోర్టులో ఈ కేసు పెండింగ్లో ఉందని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం పట్టించుకోని ముదిరాజులను బీసీఏలోకి చేర్పించే విధంగా ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు బీసీ నాయకులు బెన్నూరి ఆశన్న, భూమయ్య, బుచ్చిబాబు గౌడ్, సొమ్య నాయక్, కాగితాలమధు, గోపి, దేవేందర్, పలు గ్రామాలకు చెందిన ముదిరాజ్ సభ్యులు పాల్గొన్నారు.

## సదర్ సయ్యాట సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీర్ యాదవ్

**నారాయణ పేట, నవంబరు 21 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కేంద్రంలో కమిటీ నిర్ణయం మేరకు నవంబర్ 27, 2025 శివాలయం నుండి దున్న రాజుల ఊరేగింపు సదర్ సయ్యాట భవ్యంగా ప్రారంభమై పట్టణ పురవీధుల గుండా జరిగి పాత గంజి ఆవరణలో ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభతో ముగుస్తుంది. ఈ కార్యక్రమంలో గోమాత పూజ, దున్న రాజుల ఊరేగింపు, అనంతరం సదర్ సయ్యాట బహిరంగ సభను నిర్వహించనున్నారు. సభకు జిల్లా శాఖ అధ్యక్షుడు అధ్యక్షత వహించనున్నారు. సదర్ సయ్యాట నిర్వాహణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సిటిజన్ క్లబ్ ఆవరణలో జిల్లా సమావేశం జరిగింది. కమిటీ కన్వీనర్ అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీర్ యాదవ్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారిగా గోపాల్ యాదవ్, ఉపాధ్యక్షులుగా శశికాంత్ యాదవ్, పట్టణ అధ్యక్షుడిగా చిన్న యాదవ్, ప్రధాన కార్యదర్శిగా చెన్నకేశవ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా డబ్బా దత్తు యాదవ్, శాసమొల్ల బాలప్ప యాదవ్ ఎంపికయ్యారు. అదనంగా వెంకట్ మేస్త్రీ, రమేష్ మేస్త్రి, ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యాదవ్ కూడా పాల్గొన్నారు. యువజన విభాగం అధ్యక్షుడిగానాగేళ్ల మణివర్ధన యాదవ్ హాజరయ్యారు. సభ్యులుగా కృష్ణ యాదవ్, జగదీష్ యాదవ్, ఆనంద్ యాదవ్ తదితరులు సమావేశానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రైతుల భూముల సేకరణపై సమావేశం

**ఊట్కూర్, నవంబరు 21 ప్రభాతవార్త:** నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగంగా ఊట్కూర్ పెద్ద చెరువు పునరుద్ధరణ పనుల కోసం చేపట్టనున్న భూసేకరణపై శుక్రవారం ఊట్కూర్ గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ చింత రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధికారులు దంతన్‌పల్లి శివారులో 328.4 ఎకరాలు, ఊట్కూర్ శివారులో 132.20 ఎకరాలు భూమిని రైతుల నుండి సేకరించనున్నట్లు వెల్లడించారు. భూసేకరణకు సంబంధించిన అన్ని వివరాలను సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూసేకరణ ప్రక్రియపై ప్రతి రైతు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి. ఏవైనా అభ్యంతరాలు లేదా సందేహాలు ఉంటే వెంటనే తెలియజేయండి,"అని సూచించారు. సభలో పలువురు రైతులు, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి చెకుముఖి పోటీలకు ఎంపిక



**బిజినేపల్లి, నవంబరు 21 ప్రభాతవార్త:** పాలెం గ్రామానికి చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు ఎంపిక అయ్యారు. మండల స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మొదటి బహుమతి సాధించగా, ప్రైవేటు పాఠశాలల విభాగం లో న్యూ లిటిల్ రోజెస్ పాఠశాల మొదటి బహుమతి సాధించింది. జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు ఎంపిక విద్యార్థులకు ధృవపత్రాలు అందజేశారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఈఓ రఘునందన్ శర్మ అభినందించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, హెచ్ఎం ఖాజా మైనుద్దీన్, శృతి, రామ్ గ్రామస్తులు అభినందించారు.

## విద్యార్థుల తలరాతలను వ్రాసేది అధ్యాపకులే

**సైకాలజిస్ట్ డాక్టర్ పి.లక్ష్మణ్**



ప్రముఖ సైకాలజిస్ట్ డా.పి.లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**ధన్వాడ, నవంబరు 21 ప్రభాతవార్త :** ఆకారం లేని శిలను శిల్పిగా తీర్చిదిద్దే శిల్పి నైపుణ్యం ఎంత ముఖ్యమో, విద్యార్థి జీవితాన్ని మలచేది కూడా అధ్యాపకుని నైపుణ్యమే" అని ప్రముఖ సైకాలజిస్ట్ డా.పి. లక్ష్మణ్ అన్నారు. ధన్వాడ మండలంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డా.లక్ష్మణ్, దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మితమవుతుంది" అనే అబ్దుల్ కలాం వాక్యాన్ని ఉదహరిస్తూ, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణం పూర్తిగా అధ్యాపకుల చేతుల్లోనే ఉందని వ్యాఖ్యానించారు. సమాజంలో విద్యార్థుల జీవితాలను మలచగల శక్తి అధ్యా పకులకే ఉందని, వారు పూనుకుంటే భారతదేశ పునర్వైభవాన్ని సాధించి ప్రపంచంలో సూపర్ పవర్‌గా నిలవగలమని చెప్పారు. ఉపాధ్యాయులు వ్యక్తిగత, కుటుంబ, వృత్తి, ఆర్థిక, సామాజిక, ఆధ్యాత్మికఈ ఆరురంగాల్లోతీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన మెళకువలపై ఆయన వివరించారు. ఈ ఆరు లక్షణాలను తమలో పెంపొందించుకున్న ఉపాధ్యాయులు విద్యార్థుల జీవితాల్లోను అదే లక్ష్యాలను నింపగలరని చెప్పారు. ఎవరికైనా ఏదైనా ఇవ్వాలంటే ముందుగా అది మన దగ్గర ఉండాలి" అని సూచిస్తూ, ప్రపంచ శ్రేణి సూత్రాలు, నిత్యజీవిత ఉదాహరణలతో ఉపాధ్యాయులకుమార్గదర్శనం చేసారు. ఈ కార్యక్రమంలో మండలవిద్యాధికారిగాయత్రి, కొండాపూర్ జడ్పీహెచ్ఎస్ జిహెచ్ఎం శంకరయ్య, జడ్పిహెచ్ఎస్ ధన్వాడ బాలుర కాంప్లెక్స్ జిహెచ్ఎం ప్రదీప్‌కుమార్, టిపియుఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.అనుపటి మల్లికార్జున్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేత

**లింగాల, నవంబరు21 ప్రభాతవార్త:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎంఈఓ బషీర్ అహ్మద్, హెచ్ఎం కొండయ్య ఎంట్రెన్స్ పరీక్ష కోసం హాల్ టికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ బషీర్ అహ్మద్ మాట్లాడుతూ ఆదివారం నాగర్ కర్నూల్ లో జరిగే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ కోసం ఎంట్రెన్స్ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఇది ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు వారి ఉన్నత విద్యను కొనసాగించడానికి కేంద్ర ప్రభుత్వం అందించే ఒక స్కాలర్‌షిప్ పథకమని తెలిపారు. ఈ పథకం కింద 8వ తరగతి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తారని తెలిపారు. ఎంట్రెన్స్ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు 8వ తరగతిలో విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ప్రతిభా అన్వేషణ పరీక్ష ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. 9వ తరగతి నుండి 12వతరగతి వరకు ఈస్కాలర్షిప్ పథకం వర్తిస్తుంది. 60 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర శర్మ, శ్రీనివాస్‌రెడ్డి, శంకరయ్య, పురుషోత్తం, యాదవ్, శేఖర్, రామచంద్రయ్య, ధరమ్ సింగ్, శివకుమార్, సురేష్, శ్రావణ్ కుమార్, చిన్నయ్య, శశికళ, షమీనా బేగం, యాదమ్మ, సుజాత, రహిమ బేగం, ఫర్హాన బేగం పాల్గొన్నారు.

త్వరలోనే మొల్గర ఉల్పర వద్ద

# హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణపు పనులు ప్రారంభం

◆ అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



మొల్గర, ఉల్పర మార్గంలో దెబ్బతిన్న కాజ్‌వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**ఉప్పునుంతల, నవంబరు21 ప్రభాతవార్త:** మండలంలోని మొల్గర ఉల్పర వద్ద త్వరలో హై లెవెల్‌బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించడం జరుగుతుందని టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా, చిక్కుడు వంశీకృష్ణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని మొల్గర వద్ద దుందుభి వాగులో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించార. హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి అవుతే ఉప్పునుంతల, వంగూర్ మండలాలకు రవాణా సౌకర్యంమెరుగుపడుతు కల్వకుర్తి, హైదరాబాదు, మహబూబ్‌నగర్ వెళ్లడానికి దూరం తగ్గుతుందన్నారు. మొల్గర, ఉల్పర మధ్యన దుందుభి వాగులో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనుల కోసంనిధులు మంజురైనప్పటికీ పనులు ప్రారంభించడంలో కొంత జాప్యం జరిగిందని, బ్రిడ్జి నిర్మాణం పనులు త్వరలో ప్రారంభించేందుకు శ్రీకారంచుడతామని అన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో బ్రిడ్జి నిర్మాణపు పనులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. దుందుభి వాగు పరిశీలించిన వారిలో ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణతో పాటు అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, మామిళ్ళపల్లి ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు, ఎస్పై వెంకట్‌రెడ్డి, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు కట్టఅనంతరెడ్డి, మాజీ జడ్పీటీసీ అనంత ప్రతాప్‌రెడ్డి, స్థానిక నాయకులు పద్మారెడ్డి, ఎఎస్ఐ రెడ్యానాయక్‌లు ఉన్నారు.

# కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలి

◆ వామపక్షాల నాయకులు




రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

**ఆత్మకూర్ నవంబర్ 21, ప్రభాతవార్త:** దేశంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మావోయిస్టులను బూటకపు ఎన్కౌంటర్ల ద్వారా హత మార్చకుండా మావోయిస్టులతో చర్చలు జరిపే సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని వామపక్ష నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని అన్నగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటాలు నిర్వహిస్తూ ప్రాణాలను త్యాగం చేస్తున్న మావోయిస్టులను బూటకపు ఎన్కౌంటర్లతో హతమార్చడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. దేశంలో ఉగ్రవాద సంఘటనలకు పాల్పడుతున్న వారికి మద్దతిస్తున్న పాకిస్తాన్ చేస్తున్న యుద్ధాన్ని కేవలం అగ్ర రాజ్యం అమెరికా ఆదేశాలతో నిలుపుదల చేసిన నరేంద్ర మోడీ ప్రభుత్వానికి మావోయిస్టులను హతమార్చడం భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘికడమేనని వారు తీవ్రస్థాయిలో ఆరోపించారు. దేశంలోని మావోయిస్టులు కాల్పుల విరమణ ప్రకటించి చర్చల కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నామంటూ పత్రికా ప్రకటనలు చేసినప్పటికీ నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం మాత్రం కార్పొరేట్ వర్గాలకు భూములను తారాతత్వం చేసే కార్యక్రమంలో భాగంగానే ఆపరేషన్ కాగార్ చేపట్టి మావోయిస్టులను పొట్టన పెట్టుకుంటున్నారని ఇప్పటికైనా బూటకపు ఎన్కౌంటర్లకు స్వస్తి పలికి మావోయిస్టులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలోవామపక్షాల నాయకులు లక్ష్మీనారాయణ శెట్టి, శ్రీహరి, ప్రసాద్, వెంకటన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

# వృత్తి విద్యా కోర్సుల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలి

● వనపర్తి జిల్లా విద్యాధికారి అంజయ్య



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రికార్డులను పరిశీలిస్తున్న విద్యాధికారి

**ఆత్మకూర్ నవంబర్ 21, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి ఉపాధ్యాయ సిబ్బంది ఉత్తీర్ణతల శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని వనపర్తి జిల్లా విద్యాధికారి అంజయ్య సూచించారు. శుక్రవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలమరియు వృత్తివిద్యా కోర్సుల కళాశాలను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులకు ఉపాధ్యాయ సిబ్బంది డిసెంబర్ మొదటి వారం లోపుగా పాఠ్యాంశాలను పూర్తి చేయాలని 2026 మార్చి నెలలో జరగనున్న వార్షికపరీక్షల్లో ఉత్తీర్ణశాతం పెంచిన కళాశాలలకు విద్యార్థులకు ఉపాధ్యాయ బృందానికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లుగా ఆయన తెలిపారు. వృత్తి విద్యా కోర్సుల్లో విద్యార్థిని విద్యార్థులు రాణించి భవిష్యత్తుకు బాటిల్ వేసుకోవాలని ఆయన సూచించారు. అంతకు ముందుగా కళాశాలలోని పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సైదులు ఉపాధ్యాయ సిబ్బంది భాగ్యవర్ధన్‌రెడ్డి, విశ్వేశ్వర్, దేవదాసు, నారాయణ చారి, కురుమూర్తి తదితరులతో పాటుగా పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం



అమిస్తాపూర్‌లో ప్రపంచ మత్స్యకార దినోత్సవంలో పాల్గొన్న మత్స్యకారులు

**భూత్పూర్, నవంబర్ 21, ప్రభాతవార్త :** ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్బంగా శుక్రవారం భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌లో రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో మండల మత్స్యకారులు ఘనంగా నిర్వహించారు. మత్స్య కార సంఘ భవనం వద్ద స్వీట్లు పంచిపెట్టారు. రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర విధాన మండలి డిప్యూటీ చైర్మన్, ఎమ్మెల్సీ బండప్రకాష్ ఆదేశానుసారం మత్స్య కార 11వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్ద విజయ్‌కుమార్, జిల్లా నాయకుడు మెట్టుకాడి ప్రభాకర్, సంఘం పాలమూరు ఉమ్మడి జిల్లాల మాజీ అధ్యక్షుడు మనెమోని సత్యనారాయణలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్ బిడ్డ ఎమ్మెల్సీగా ఎదగడంతో పాటు మండలి డిప్యూటీ చైర్మన్‌గా సేవలంది స్తున్నారని పేర్కొన్నారు. రు.మూడొందల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిలోహైదారబాద్‌లోని కోకాపేటలో రు.5 కోట్లతో ముదిరాజ్ సంఘ భవన నిర్మాణం, జిల్లా కేంద్రాల్లో భవన నిర్మాణాలు చేపట్టారన్నారు. సిద్దపేటలో ముదిరాజ్‌లకు సంబంధించి ఏసీ ఫంక్షన్‌హాల్ నిర్మాణం చేప ట్టారన్నారు. ముదిరాజ్‌లను బీసీ-డి గ్రూపు నుంచి బీసీ-ఏలోకి మార్చే ప్రక్రియను బండ ముందుకు నడిపారన్నారు. ముదిరాజ్‌లకు రు.వెయ్యి కోట్లతో 75 శాతం సబ్సీడీతో వివిధ పథకాలు చేపట్టి అమలుచేస్తున్నారని పేర్కొన్నారు. రు.150కోట్లతో మూడు వేల 200మంది మత్స్య కారులకు మినీ వాహనాలు మంజూరు చేశారన్నారు. రు.150 కోట్లతో63వేల మందిమత్స్యకారులకు ద్విచక్రవాహనాలు మంజూరు చేశారన్నారు. అనతికాలంలోనే దాదాపు వెయ్యి మత్స్యకార సొసైటీలనేర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ మండల మత్స్యకార సంఘం అధ్యక్షుడు ఊరడి మహానంది, భూత్పూర్ పట్టణ అధ్యక్షుడు గొడుగు వెంకటరాజు, కార్యదర్శి రాములు, మూష సాయిలు, గుడి మహేష్, మహబూబ్‌నగర్ పట్టణ అధ్యక్షుడు తిమ్మాపూర్ నరసింహ, గొడుగు మల్లేష్, చెన్నయ్య, పులగుర్ల మల్లేష్, చీపుర్ల తిరుపతయ్య, అమిస్తా పూర్ సంఘం అధ్యక్షుడు ముత్యల చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు ఊరడి నారాయణ, కార్యదర్శి ఊరడి పెంటయ్య, మాజీ సర్పంచి ఆకుల వెంకటయ్య, చెన్నయ్య, వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

# దళిత యువకుడిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి



ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న దృశ్యం

**దామరగిద్ద, నవంబరు 21 ప్రభాతవార్త:** షాద్‌నగర్‌కు చెందిన కర్రె రాజశేఖర్ హత్యను నిరసిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో దామరగిద్ద అంబేద్కర్ చౌరస్తాలో నిందితులను కఠినంగా శిక్షించాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యలు మాట్లాడుతూ సమాజంలో కు ళ్లునుకుని ఉన్న కులోన్మాద శాడిజాన్ని షాద్‌నగర్‌లో జరిగిన శాడిజాన్ని పరువు హత్య సభ్య సమాజం తలదించుకునేలా చేసిందన్నారు. తమ్ముడు కులాంతర వివాహం చేసుకున్నాడనే కారణంతో, అతని అన్నను అమ్మాయి కుటుంబసభ్యులు హత్య చేయడం కేవలం ఓ కుటుంబ వైరమో, వ్యక్తిగత కక్షో కాదు. ఇది మనం 21వ శతాబ్దంలోనే ఉన్నామా లేక మధ్యయుగాల్లో ఉన్నామా అనేప్రశ్న లేవనెత్తుతుందన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగ ఇలాంటి ఘటనలు పునరావృతమౌతున్నాయని విమర్శించారు. కులం పేరుతో కత్తులు నూరుతున్న అనాగరిక చర్యలను ఎలా సమర్థించుకోగలం రాష్ట్రంలో ఇటీవలి కాలంలో పేట్రేగిపోతున్న కుల, మత దురహంకార హత్యలు, వాటి వెనుక ఉన్న మనువాద భావజాలం అభివృద్ధికి ఆటంకాలు కాదా మన ప్రభుత్వాలు, పాలకులు, మేధావులు ఎందుకు ఆలోచించడం లేదు అన్నదే ప్రశ్న. పరువు పేరిట జరుగుతున్న ఈ కుల దురహంకార హత్యలను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. వెంటనే రాజశేఖర్ ను హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాజశేఖర్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సహాయం అందివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జోషి, శివకుమార్, షేర్‌ఖాన్, గుర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న నాయకులు

**వీపనగండ్ల నవంబర్ 21, ప్రభాతవార్త:** మండలంలోని వివిధ గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు వీపనగండ్ల మండల ఏపీఎం మద్దిలేటి తెలిపారు. శుక్రవారం నాడు వరి కొనుగోలు కేంద్రాలు గోపాల్దిన్నె కల్వ రాళ్ల వల్లభాపురం తాండ సంగినేనిపల్లి సంపత్ రావు పల్లి కొర్లకుంట గ్రామాలలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ ప్రారంభానికి ఐకెపి మహిళా సంఘాల కార్యకర్తలతో పాటు కాంగ్రెస్ పార్టీ మండలఅధ్యక్షుడు గోదల బీరయ్య యాదవ్ సుదర్శన్ రెడ్డి వెంకట్రాజయ్య చిన్నారెడ్డి మాజీ రైతు సమితి మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి రఘునాథరెడ్డి నాగర్‌కర్నూల్ టూరిజం శాఖ ప్రతినిధి కల్వరాల్ల నరసింహ వెంకటేష్ గోపాల్దిన్నె మాజీ సర్పంచ్ బాల్ రెడ్డి తాతారావు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూగ్రామాలలో వరి కొనుగోలును త్వరితగతిన పూర్తి చేయాలని రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా మహిళా సంఘాల ప్రతినిధులు చూసుకోవాలని వారు తెలిపారు.

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ఇటిక్యాల నవంబర్21, ప్రభాతవార్త:** ఐకేపీ మహిళా సంఘం ద్వారా మండల పరిధిలోని పుటాన్ దొడ్డి గ్రామంలో శుక్రవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఏఈఓ జెన్నీఫర్. మరియు మహిళా సమాఖ్య సంఘం సభ్యులు..మరియు గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ.. జూరాల ఆయకట్టు కింద రైతులు పండించిన వరి ధాన్యాన్ని గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోని అమ్ముకోవాలని. అధికారులు నిర్ణయించిన ప్రకారం తేమశాతం ఉండేలా రైతులు చూసుకోవాలని ఏగ్రేడు రకం 2.389 రూపాయలు. సాధారణ రకానికి క్వింటాల్కు 2.369 రూపాయలు ప్రభుత్వం సకాలంలో రైతులకు జమ చేస్తుందని అలాగే సన్న రకం వరి ధాన్యానికి అదనంగా 500రూపాయల బోనస్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు కేంద్రంలో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు చిన్నయ. వివో ఏ జంగం శాంతయ. మహిళా సంఘం సభ్యులు హరిత. రేణుక. మహాదేవమ్మ. మరియు రైతు సంఘం సభ్యులు పాపిరెడ్డి. దామోదర్ రెడ్డి. కృష్ణ. గోపాల్. పెద్దకృష్ణ. మద్దిలేటి. నరసింహ. శివన్న. మైబు ఉన్నారు.

## 26న కార్మిక చట్టాలపై నిరసనను విజయవంతం చేయాలి

**ఇటిక్యాల నవంబర్ 21, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మికప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా నవంబర్ 26న జిల్లా కేంద్రాల్లో నిర్వహించే నిరసన కార్యక్రమాలను కార్మికుల జయప్రదం చేయాలని మండల సిపిఐ పార్టీ కార్యదర్శి ఆశన్న పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఈ సందర్భంగా ఆశన్న మాట్లాడుతూ... కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నవంబర్ 26న జిల్లా కేంద్రాలలో జరిపే కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఈ కార్యక్రమానికి కార్మికులు రైతులు ఇతర వర్గాలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు. అంతేకాకార్పొరేట్ కంపెనీల దోపిడీకి వ్యతిరేకంగా, పంటలకు మద్దతుధరల గ్యారెంటీ చట్టం చేయాలని, విద్యుత్ బిల్లుచట్టం 2025 నీ ఉపసంహరించాలని. తదితర డిమాండ్లపై అలాగే పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులు అమలు చేయాలని రోజుకు 700 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రంగన్న. నాగార్జున. పాల్గొన్నారు.

## స్వచ్ఛందంగా ముందుకు వచ్చి.. విద్య బోధన చేస్తున్న కలుముల భౌతిక



బాలుర పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛందంగా బోధన అందిస్తున్న భౌతిక

**ఉప్పునుంతల, నవంబరు21 ప్రభాతవార్త :** భారత్ విద్య ఉద్యమం సహ వ్యవస్థాపకులు కలుముల భౌతిక విద్యార్థులకు స్వచ్ఛందంగా బోధన అందించడం పట్ల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల ప్రాథమిక బాలుర పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాలకు వెళ్లగా, మరో ఉపాధ్యాయురాలు ఇతర పాఠశాలకు వెళ్లడం జరిగింది. దీంతో ఆ పాఠశాలలో ఒక్కరే ఉపాధ్యాయులు ఉన్నారని భావించిన పాఠశాల ఉపాధ్యాయులు గాజుల వెంకటేష్ సతీమణి కలుముల భౌతిక విద్యార్థుల కోసం స్వచ్ఛందంగా పాఠశాలకు వచ్చి బోధన అందించింది. దీంతో పాఠశాల విద్యార్థులతల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. తన భర్త వెంకటేష్ సహకారంతో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకొని కరోనా సమయంలో భారత విద్య ఉద్యమం ఏర్పాటులో సహ వ్యవస్థాపకులుగా క్రియాశీల పాత్ర పోషించి ఉచితంగా గురుకుల పాఠశాలలకు సీట్లు సాధించే విధంగా ఆన్లైన్ తరగతులు నిర్వహించి వందల మంది విద్యార్థులకు గురుకుల పాఠశాలలో సీట్లు వచ్చేలా కృషిచేశారు. ప్రభుత్వ పాఠశాల లో చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించేందుకు తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలలబలోపేతానికి, విద్యా ప్రాముఖ్యతను తెలియజేయడానికి ఎన్నో వినూత్న కార్యక్రమాల నిర్వహణలో భౌతిక సేవలు విద్యార్థులకు అందించడం అభినందనీయమని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

## భూత్పూర్ జెడ్పీహెచ్ఎస్‌లో మున్సిపాలిటీ డ్రైడే

**భూత్పూర్, నవంబర్ 21, ప్రభాతవార్త:** ప్రతీ శుక్రవారం పట్టణ మున్సిపాలిటీ నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడేను పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఉన్న అపరిశుభ్రతను మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. పిచ్చిమొక్కలు, చెత్తచెదారాలన తొలగించారు. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత వల్ల ఆరోగ్యంగా ఉంటామని, పరిసరాలనుఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పట్టణ మున్సిపాలిటీ ప్రతీ శుక్రవారం డ్రైడేను నిర్వహిస్తోందని ఇందులో అధికారులు మొదలు కిందిస్థాయి సబ్బంధి వరకు అందరూ పాల్గొని పరిశుభ్రతాచర్యలు చేపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సూపరిన్‌టెండెంట్ నర్సింహులు, స్వచ్ఛ సర్వేచ్ఛన్ ఇంచార్జీ శివప్రసాద్‌తో పాటు పీహెచ్‌సీ ఎంఓ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్, యునాని వైద్యులు డాక్టర్ మొహ్మద్ జహిరొద్దిన్ ఆశ వర్కర్లు, ఆర్పీలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయ భూమికి హద్దులు గుర్తించాలి

**ఊట్కూర్, నవంబరు 21 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండల పరిధిలోని బిజ్వార్ గ్రామంలోని బీసీ కాలనీలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవత ఆలయానికి సరిహద్దులు గుర్తించాలని గ్రామస్తులు శుక్రవారం ఊట్కూరు మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో గతంలో ఆలయానికి కేటాయించిన భూమి అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉందని వారుఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఆలయ భూమిని గుర్తించి, సరిహద్దులు ఖరారు చేసి, దేవాలయాన్ని రక్షించాల్సిన అవసరం ఉందని తహసీల్దార్‌ను కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో పూజారి ఆంజనేయులు గౌడ్, పూజారి నాగేష్‌గౌడ్, పి.నారాయణ గౌడ్, పి.నాగేష్ గౌడ్, బాలకిషన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, దోరోళ్ల కృష్ణయ్య, పోలీస్ హన్మిరెడ్డి ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

## కోటి మంది మహిళలకు చీరలు

(మొదటి పేజీ తరువాయి)

పోలీసింగ్‌కు పీర్లగుట్ట కమ్యూనికేషన్ నెట్‌వర్క్ మరింత బలోపేతం చేస్తుందని, పోలీసు కమ్యూనికేషన్ నెట్‌వర్క్ బలోపేతానికి ఇది ఒక కీలకమైన ప్రాజెక్టు అని శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి పీర్ల గుట్టపై కమ్యూనికేషన్ రిపీటర్ భవనానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో ప్రజలకు మరింత భద్రతను అందించడానికి పోలీస్ విభాగంలో ఆధునిక సదుపాయాలు అవసరం. రూ.72 లక్షల వ్యయంతో కమ్యూనికేషన్ రిపీటర్ భవనం నిర్మాణం ప్రారంభమవడం వనపర్తికి ఒక గొప్ప అవకాశంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ వసతి ద్వారా పోలీసులు వేగవంతంగా స్పందించి ప్రజలకు దగ్గరవుతారని అన్నారు. అభివృద్ధి ప్రతిచోటా కనిపించేలా ప్రయత్నాలు కొనసాగుతాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ పోలీసింగ్‌లో కమ్యూనికేషన్ వ్యవస్థ బలంగా ఉండటం అత్యంత అవసరం అన్నారు. తెలంగాణ పోలీసు హౌజింగ్ బోర్డు వల్ల దీనికి మరింత బలం లభిస్తోందన్నారు. జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ పోలీసు కమ్యూనికేషన్ అనేది శాంతి భద్రతల పరిరక్షణలో అత్యంత కీలకమైన విభాగమని వివరించారు. జిల్లాలోని పలు దూర ప్రాంతాలు, అటవీ ప్రాంతాలలో సిగ్నల్ సమస్యలను అధిగమించడానికి, అత్యవసర పరిస్థితుల్లో కమ్యూనికేషన్ స్పష్టతను పెంచడానికి ఈరిపీటర్ భవనం అత్యంత మద్దతునిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి డిఎస్పి వెంకటేశ్వరరావు, శిక్షణ డిప్యుటీ కలెక్టర్ శ్రావ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి సిఐ కృష్ణయ్య, కొత్తకోట సిఐ రాంబాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, వనపర్తి తహసిల్దార్ రమేష్ రెడ్డి, పోలీస్ హౌసింగ్ ఎఈ, అనిల్ శాస్త్రి, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

(మొదటి పేజీ తరువాయి)

మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా కొత్త చెరువు దగ్గర జరిగిన ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సముద్రం, చెరువులు, జలాశయాలే జీవనాధారంగా బతుకుతున్న మత్స్యకారులకు భద్రత, స్థిర ఆదాయం కల్పించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమన్నారు. చేప పిల్లల పంపిణీ, బీమా సౌకర్యాలు, శిక్షణ కార్యక్రమాలు, ఆధునిక మత్స్య పరిశ్రమ అభివృద్ధి వంటి అంశాల్లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. మత్స్యకారుల కోసం ప్రకటించిన ప్రతి సంక్షేమ పథకం క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జీ గోనెల శ్రీనివాస్ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేస్తూ పనిచేయాలని ఆయన సూచించారు. పిల్లలకు మంచి విద్యను అందించాలని, వారు బాగా చదువుకొని జీవితంలో స్థిరపడాలన్నదే తన ఆశయం అన్నారు. అందుకే మన పిల్లలు ఉన్నత చదువుల కోసం ఎక్కడో దూరప్రాంతాలకు వెళ్ళాల్సిన అవసరం కూడా లేదన్నారు. మన మహబూబ్ నగర్ పిల్లల కోసమే ఐఐఐటి, ఇంజనీరింగ్, లా కళాశాల, ఎటిసి సెంటర్, లాంటి ఎన్నో విద్యాసంస్థలు, తెచ్చామన్నారు. 10,15 సంవత్సరాల పాటు చదువుపైననే పిల్లలు దృష్టి పెట్టేటట్లు వారి తల్లిదండ్రులు శ్రద్ధ చూసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం కొత్త చెరువులో చేప పిల్లలను వదిలారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లామత్స్య పారిశ్రామిక సహకార సంఘంపర్సన్ ఇంచార్జీ గోనెల శ్రీనివాసులు, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, నాయకులు మైత్రి యాదయ్య, నర్సింహులు, ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, దోమ పరమేష్, శ్రీనివాస్, తుప్పలి ఆంజనేయులు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిగుండం తొక్కిన అయ్యప్ప స్వాములు

◆ వైభవంగా యంనోనిపల్లి ఉమామహేశ్వర స్వామి జాతర



అగ్నిగుండం తొక్కుతున్న అయ్యప్ప స్వాములు

**ధన్వాడ, నవంబరు21 ప్రభాతవార్త:** ధన్వాడ మండలం ఎంనోన్పల్లి గ్రామంలో వెలసిన ఉమా మహేశ్వర స్వామి జాతర ఉత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య భవ్యంగా నిర్వహించారు. వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం భక్తుల అగ్నిగుండం కార్యక్రమం ఎంతో ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకారాలు చేసి మంగళహారతులు అందించారు. అనంతరం అయ్యప్ప మాలధారులు, భక్తులు స్వామి శరణం అయ్యప్ప" నినాదాలతో అగ్నిగుండంపై అడుగులు వేసి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. అగ్ని మీద నడుస్తూ భక్తులు చూపిం˘నిబద్ధత, విశ్వాసం చూసి హాజరైన ప్రజలు భక్తిరసంలో తేలి పోయారు. గ్రామం నిండా జాతర ఘోషలు, మంగళవాద్యాలు మార్మోగగా, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, భక్తులు పాల్గొని ఉత్సవాన్ని మరింత ప్రతిష్టాత్మకంగా మార్చారు. భక్తులు అగ్నిగుండం తొక్కడం గ్రామంలో పవిత్రతకు, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల అయ్యప్ప స్వాములు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చెకుముఖిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు



**వెల్దండ, నవంబర్ 21 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. పోటీలకు మండలంలోని 12పాఠశాలలకు చెందిన 36 మంది విద్యార్థులు పాల్గొన్నారని ఎంఈఓ చంద్రుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి స్థానంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు నిలువగా ద్వితీయ స్థానంలో కొట్ర జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు వినయ్ 10వతరగతి చరణ్ వర్షిత బహుమతి సాధించడంతో ఎంఈఓ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కోట్ర జిహెచ్ఎం ప్రేమకుమారి, ఉపాధ్యాయులు రామారావు, విజయ్ కుమార్, సరిత, ప్రభావతి, చెన్నకేశవులు విద్యార్థులను అభినందించారు.

## వరిపంటను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

**ఇటిక్యాల నవంబర్ 21, ప్రభాతావార్త:** మండల పరిధిలోని శుక్రవారం మునగాల గ్రామంలో వేసిన వరి పంట ను వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. శుక్రవారం మునగాల గ్రామంలో రైతు రామన్‌గౌడ్ పండించినపంటను కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం మరియు ప్రాంతీయ పరిశోధన స్థానము, పాలెం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కలిసి వరి పంటలో ఆర్ఎన్ఆర్ 15048 అనే రకం తెలంగాణ సోనాపై పరిశీలన నిర్వహించారు. రైతుల స్థాయిలోఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులతో మాట్లాడుతూ గ్రామ గ్రామాన శాస్త్రవేత్తలు సూచించిన నాణ్యమైన విత్తనోత్పత్తి చేపట్టి రైతులుపండించుకుంటే విత్తనం ఖర్చుతగ్గడమే కాకుండా దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డా. ఆదిశంకర్, కె. సిద్ధప్ప, ఏ. శ్రీరామ్, ఎం.శంకర్ మరియుమండల వ్యవసాయ అధికారి రవికుమార్. రైతులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్‌లో కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన

**లింగాల, నవంబరు 21 ప్రభాతవార్త:** లింగాల మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో పోలీస్ శాఖ ఆధ్వర్యంలోశుక్రవారం కమ్యూనిటీ పోలీసింగ్‌కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యాపారులు, మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ మాట్లాడుతూ పోలీసు అధికారులు ప్రజలకు నేరాల నిరోధం, మహిళా భద్రత, ట్రాఫిక్ నియమాలు, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా పోలీసులకు ప్రజల మధ్య నమ్మకం, సహకారం పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సిఈఓ పాండు పాల్గొన్నారు.

## మహిళల భద్రత మా బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

సాధారణ ప్రయాణికురాలిలా వారి మధ్యలో వెళ్లిమాట్లాడారు. బస్టాండ్‌లో వేచి ఉన్న బాలికలతో, మహిళలతో వ్యక్తిగతంగా మాట్లాడి, ఎవరి నుండైనా వేధింపులు, అసౌకర్యాలు, అనుమానాస్పద ప్రవర్తన వంటి సమస్యలు ఎదురైతే వెంటనే ధైర్యంగా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఎవరి వల్లనైనా మీకు అ సురక్షి తంగా అనిపించినా, వెంటనే టోల్ 100 నెంబర్ లేదా జిల్లా షీ టీమ్ నెంబర్ 8712659365 కి కాల్ చేయాలని సూచించారు. పోలీసు శాఖ మీకు అండగా ఉంటుందని మీ భద్రత కోసం 24 గంటలు సిద్ధంగా ఉండాలి ఉన్నామని, మీలో ధైర్యం ఉండాలని సూచించారు. షీ టీమ్ ప్రత్యేకంగా మీకోసం పనిచేస్తోందని తెలిపారు. బస్టాండ్ ప్రాంగ ణంలో బాలికలు, మహిళలను ఉద్దేశించి భద్రతపై అవగాహన సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో షీ టీమ్ పోస్టర్లను బాలికల చేతుల మీదుగా విడుదల చేశారు. ప్రజల్లో మహిళల భద్రతపై అవగాహన పెంచేందుకు పోలీసులు ఇలాంటి కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో విమెన్ పిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, షీ టీం, ఎహెచ్‌టియు సురక్ష కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ రూపకల్పన చేయాలి

◆ వార్డుల రిజర్వేషన్ ప్రక్రియ పై అవగాహన ◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్

**వనపర్తి, నవంబరు21 ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ ఎన్నికలకు 2011 జనాభా లెక్కలు డెడికేషన్ కమిషన్ ఇచ్చిన వివరాల ప్రకారం మాత్రమే రిజర్వేషన్ రూపకల్పన చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, ఎంపిఓలతో గ్రామ పంచాయతీ, వార్డుల రిజర్వేషన్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం బిసి లకు రిజర్వేషన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. డెడికేషన్ కమిషన్ ఇచ్చిన వివరాల ఆధారంగా వార్డులలో కేటగిరి వారిగా రిజర్వేషన్ ప్రక్రియ పకడ్బందీగా సిద్ధం చేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నుండి ఉత్తర్వులు వచ్చాక కేటగిరి వారిగా 50 శాతం రిజర్వేషన్ మహిళలకు డిప్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓలు , ఎంపిఓలు

ద్వారా కేటాయించాల్సి ఉంటుందని తెలియజేశారు. జిల్లాలోని 268 గ్రామ పంచాయతీలలో కొత్తగా ఏర్పడిన 13 గ్రామ పంచాయతీలకు మొదటి రొటేషన్ విధానం ద్వారా మిగిలిన గ్రామ పంచాయతీలకు రెండవ రొటేషన్ విధానాన్ని అనుసరించాలని సూచించారు. తుది జాబితా ఇచ్చేటప్పుడు తప్పులు లేకుండా ఒకటికి పదిసార్లు చూసుకొని సంతకంతో ఇవ్వాలని ఆదేశించారు. కాగా ఎంపీడీఓలు, ఎంపీఓలు జడ్పీ సిఈఓ, జిల్లా పంచాయతీ అధికారి, ఆర్డీఓ సహకారంతో వార్డుల వారిగా రిజర్వేషన్ల ప్రక్రియపై రోజంతా నిమగ్నమై ఉన్నారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీ యాదయ్య, డిపిఓతరుణ్ చక్రవర్తి, ఆర్డిఓ సుబ్రహ్మణ్యం, డిఎల్పీఓ రఘునాథ్ రెడ్డి, ఎంపీడీఓలు, ఎంపీఓలు ఉన్నారు.

# సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

■ తెలంగాణ ప్రాంత సహా సంఘటన కార్యదర్శి విష్ణువర్ధన్

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు21 ప్రభాతవార్త:** దేశం కోసం విద్యార్థులు అందరూ జాతీయ భావాజాలం వైపు నడిపేందుకు ఏబీవీపీ కృషి చేస్తుందని చదువుతోపాటు సమాజ నిర్మాణంలో విద్యార్థులందరూ పాల్గొనాలని తెలంగాణ ప్రాంత సహా సంఘటన కార్యదర్శి విష్ణు వర్ధన్ పిలుపునిచ్చారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పాలమూరు నగర అభ్యాస వర్గ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో వున్న లిటిల్ స్కాలర్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ వర్గలో విష్ణువర్ధన్ పాల్గొని మాట్లాడుతూ 1949 జూలై 9నఅతి తక్కువ మంది విద్యార్థులతో ప్రారంభమై నేడు ప్రపంచంలోనే అతి పెద్ద విద్యార్థి సంఘంగా అని దేశంలో 50లక్షలకు పైగా మెంబర్షిప్‌తో నిలిచిందన్నారు. విద్యార్థులందరు ఒత్తిడిని జయించాలని క్రీడోత్సవ్ పేరుతో క్రీడా




మాట్లాడుతున్న నాయకులు



హాజరైన సభ్యులు

కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని అలాగే ఎస్ఎఫ్‌డీ పేరుతోఈ సమాజంలో పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులు పని చేయాలని ఎస్ఎఫ్ఎస్, కళామంచ్ పేరుతో విద్యార్థుల లోపల ఉన్న కళలను ప్రోత్సహించడం కోసం పనిచేస్తుందని అన్నారు. అనంతరం నూతన నగర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా సుదర్శన్ రెడ్డిని, కార్యదర్శిగా శివ ప్రసాద్‌ని, పూర్తి నగర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతీయకార్యవర్గ సభ్యులు కాయంనవేంద్ర, తెలంగాణ ప్రాంత ఎస్ఎఫ్‌డీ ప్రాంత ప్రముఖ్ పోతురాజుస్వామి, పాలమూరు విభాగ్ కన్వీనర్ ఎడ్ల నరేష్ తేజ పాలమూరు జిల్లా ప్రముఖ్ వేణు, జిల్లా కన్వీనర్ సౌమ్య, రాష్ట్ర కార్యసమితి సభ్యుడు అర్జున్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివసాగర్ నగర, జిల్లాల కన్వీనర్‌లు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూర్ అభివృద్ధికి సహకరించండి

### రాష్ట్ర మంత్రులను కలిసిన కాంగ్రెస్ నాయకులు

**ఆత్మకూర్ నవంబర్21,ప్రభాతవార్త:** నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఆత్మకూరు ఉమ్మడి మండలం మూడు ముక్కలుగా విడిపోవడంతో పూర్వవైభవం కోల్పోయి ఆత్మకూరు పట్టణం పూర్తిగా తిరువగమనంలో పయనించిన విషయాన్ని గుర్తించి ఆత్మకూర్ పట్టణ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధిశాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి మరియు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు కలిసి విజ్ఞప్తి చేసినట్లుగా ఆత్మకూరు మండల కాంగ్రెస్ నాయకులు ప్రభాతవార్తకు తెలిపారు. శుక్రవారం రోజు హైదరాబాదులోని రాష్ట్ర మంత్రుల చాంబర్‌కు వెళ్లి వాకిడి శ్రీహరి ఆదేశాల మేరకు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి ఉమ్మడిఆత్మకూరు మండలంలో రోడ్ల అభివృద్ధి కోసం తక్షణమే నిధులు విడుదల చేసి అభివృద్ధికి సహకారం అందించాలని కోరినట్లుగా ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా మక్తల్ నియోజకవర్గం మాజీ అధ్యక్షులు తులసిరాజు యాదవ్ తదితరులు ప్రభాతవార్తకు తెలిపారు. అంతేకాకుండా ఉమ్మడి ఆత్మకూరు మండలం నియోజకవర్గం మూడు ముక్కలుగా చీలిపోయి పతనావస్థలో చేరుకున్న విషయాన్ని గతంలో పాలకుల దృష్టికి తెచ్చినప్పటికీ అభివృద్ధికి ఏమాత్రం చర్యలు చేపట్టలేదని ప్రస్తుతం ఆత్మకూర్ పట్టణాన్ని రెవెన్యూ డివిజన్ గా ప్రకటించడమే కాకుండా జూరాల మీదుగా గద్వాల్ వరకు నూతనంగా



నిర్మించే మృతి నిర్మాణానికి యుద్ధప్రాతి పరికన పనులు చేపట్టి పూర్తి చేయించేందుకు చీరలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేసినట్లుగా తెలిపారు. ఆత్మకూరు పట్టణాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉన్నతాధికారులను కలిసేందుకు పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యుల సూచన మేరకు నిరంతరం చర్యలు తీసుకుంటున్నా మని వారు వివరించారు. ఉమ్మడి ఆత్మకూరుమండలంలో రోడ్లు అధ్వాన స్థితికి చేరిన విషయాన్ని మంత్రి దృష్టికి తెచ్చామని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలోపు గానే నిధులను విడుదల చేసి రోడ్డు మరమ్మత్తులకు మరియు నూతన రోడ్డు నిర్మాణాలకు నిధులు విడుదల చేసేందుకు సంపూర్ణంగా సహకరించినట్లుగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చినట్లుగా వారు తెలి పారు. రాష్ట్ర మంత్రులను కలిసిన వారిలో ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ ఆత్మకూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లగొండ శ్రీనివాసులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముదిరాజ్ తదితరులు ఉన్నట్లుగా తెలిపారు.

# ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

**వెల్దండ, నవంబర్ 21 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ సందర్భంగా ముదిరాజ్ సంఘం కార్యాలయంలో ముదిరాజ్ సంఘం నాయకులు తెలంగాణ ముదిరాజ్ మహాసభ 11వ వార్షికోత్సవంతో పాటు ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యకారుల డైరెక్టర్ క్యాసారపు వెంకటయ్య, మండల అధ్యక్షులు మల్లేష్‌లు మాట్లాడుతూ ముదిరాజులను బిసి-డి నుంచి బీసీ-ఏలోకి మార్చాలని, సుప్రీంకోర్టు ఆదేశాలనుసారం తెలంగాణ బిసి కమిషన్ తగిన అదేశాలను జారీ చేసి ముదిరాజ్‌లకు న్యాయం చేయాలని కోరారు. ముదిరాజుల సంఖ్య పరంగా అభివృద్ధి కోసం బడ్జెట్లో 20,000 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మత్స్యశాఖకు 3000వేల కోట్ల రూపాయలను కేటాయించి వివిధపథకాల ద్వారా మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలని తెలిపారు. 50ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ వృద్ధాప్య మత్స్యకార అభయహస్తం ప్రారంభించి ఆదుకోవాలని కోరారు. ముదిరాజ్‌నాయకులు భయ్య మల్లయ్య, పిల్లి దేవేందర్ ముదిరాజ్, మహాసభ మండల యూత్ అధ్యక్షుడు బొక్కలశ్రీనివాస్, రంగరాతి శ్రీశైలం, మారేపల్లి శ్రీనివాస్, తోపాటు తదితరులు ఉన్నారు.

**బిజినేపల్లి, నవంబరు 21 ప్రభాతవార్త:** మన దేశ ఆర్థిక వ్యవస్థకు, ఆహార భద్రతకు మత్స్యకారులు వెన్నెముక్కగా నిలుస్తున్నారని మత్స్య కార్మిక శాఖ జిల్లా డైరెక్టర్ బి.మంజుల అన్నారు. నంది వడ్డేమాన్ గ్రామంలో శుక్రవారం ప్రపంచ మత్స్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా డైరెక్టర్ బి. మంజుల మాట్లాడుతూ సమతుల్యతతో కూడిన, స్థిరమైన మత్స్య ఉత్పత్తిని ప్రోత్సహించడం ద్వారానే, మనం నీలి విప్లవాన్ని నిజం చేయగలం అన్నారు. నదులు, చెరువుల పై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందన్నారు. బ్రతుకు పోరుసాగిస్తున్న మత్స్యకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యాట శంకరయ్య, వేమ వెంకటరాములు, చింతల నాగరాజు, ఈర్ల గిరిబాబు, గుళ్ల కర్రాజు గుళ్లశరతు, అబ్బునరేందర్, అబ్బా ఆంజనేయులు, గుళ్ల పెంటయ్య, గుళ్ల నారాయణ, చాపల రాములు, లట్టుపల్లి శాంతయ్య, తదితరులు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

**దామరగిద్ద, నవంబరు21 ప్రభాతవార్త:** ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ సందర్భంగా దామరగిద్ద మండల కేంద్రంలో స్థానిక అంబా భవాని దేవాలయం దగ్గర ముదిరాజ్ సంఘం నాయకులు తెలంగాణ ముదిరాజ్ మహాసభ 11వ వార్షికోత్సవ వేడుకలను



జెండావిష్కరణ చేస్తున్న నాయకులు





పోస్టర్లను విడుదల చేస్తున్న ముదిరాజ్‌లు

జరిపి, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ జండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుత సుప్రీంకోర్టు ఆదేశానుసారం తెలంగాణ బిసి కమిషన్ తగిన అదేశాలను జారీ చేసి ముదిరాజ్‌లకు న్యాయం చేయాలని కోరారు. ముదిరాజుల సంఖ్య పరంగా అభివృద్ధి కోసం బడ్జెట్లో రూ.20,000 వేలకోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మత్స్యశాఖకు రూ.3000వేల కోట్లను కేటాయించి వివిధపథకాల ద్వారా మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలని తెలిపారు. 50ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ వృద్ధాప్య మత్స్యకార అభయహస్తం ప్రారంభించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు మొగలప్ప, మైపాల్, నర్సింలు, వెంకటరాములు, పుట్టిరాజు, వెంకటేష్, వెంకటప్ప, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.



రాజమౌళిపై ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

## సినీ దర్శకుడు రాజమౌళిపై ఫిర్యాదు

**వెల్దండ, నవంబర్21 ప్రభాతవార్త:** హిందువుల ఆరాధ్య దైవమైన హనుమంతుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళిపై బీజేపీనాయకులు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసిఅంబేద్కర్ విగ్రహం ముందు రాజమౌళి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బతినేల మాట్లాడడం సరికాదని, వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మండల పార్టీ అధ్యక్షులు కుర్మిద్ద యాదగిరి, మదన్‌గౌడ్, సుధాకుమార్, వెంకటేష్, రామకృష్ణ, రఘు గౌడు, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, యాదగిరి, గణేష్ ఉన్నారు.

## గుండెపోటుతో వ్యక్తి మృతి

**ఊట్కూర్, నవంబరు21 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండల కేంద్రంలోని ఎల్బీనగర్ కాలనీ తీవ్ర విషాదంలో మునిగిపోయింది. స్థానిక నివాసి వెంకటేష్ గౌడ్(54) శుక్రవారం తన పనుల్లో నిమగ్నమై ఉండగా అకస్మాత్తుగా తీవ్రమైన ఛాతినొప్పితో అస్వస్థతకు గురయ్యారు. పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను నారాయణపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ, గుండెపోటు తీవ్రత అధికంగా ఉండడంతో చివరికి ఆయన ప్రాణాలను రక్షించలేకపోయారు. ఈ వార్త తెలుసుకున్న వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు, కాలనీవాసులు ఆసుపత్రికి చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలిసిన గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యంచెప్పారు. సామాజికంగా అందరితో కలిసిమెలిసి ఉండే స్వభావం కలిగిన వెంకటేష్‌గౌడ్ మృతి గ్రామంలో విషాదాన్ని నింపింది. పలువురు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## మహిళపై దాడి : కేసు నమోదు

**లింగాల, నవంబరు 21 ప్రభాతవార్త:** మహిళాపై దాడి జరిగిన సంఘటన లింగాల మండల పరిధిలోని వల్లభాపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం తగిలి సైదమ్మ తన ఇంటి ముందు కట్టె పాతి కరెంట్ కోసం కనెక్షన్ తీసుకున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 సమయంలో అదే గ్రామానికి చెందిన గాలి రాములు కరెంట్ కోసం కట్టె పాతిన స్థలం నాది అనికట్టెను తొలగించినట్లు తెలిపారు. ఈవిషయంపై సైదమ్మరాములును ప్రశ్నించగా రాములు కోపంతో అసభ్యకర పదజాలంతో తిడుతూ ఇటుకతో దాడి చేయడంపై ఆమెకుడి కాలు, వీపు భాగంలోగాయాలు అయినట్లు తెలిపారు. గాయాలైన సైదమ్మ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మక్తల్‌లో 2కే రన్

**మక్తల్ టౌన్, నవంబరు21 ప్రభాతవార్త:** 77వ ఎన్‌సీసి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నవంబర్ నాలుగో ఆదివారం ఈ నెల 23న ఎన్‌సీసి డేఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌సీసీ సిటివో లక్ష్మణ్ తెలిపారు. ఆదివారం నాడు ఉదయం7 గంటలకు మక్తల్ కేంద్రంలో బాలుర పాఠశాలలోని జెడ్‌పిహెచ ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 2కే రన్ (అంబేద్కర్ కూడలి నుండి దండుగేట్ వరకు) నిర్వహిస్తున్నట్లు లక్ష్మణ్ తెలిపారు. ఔత్సాహికులైన బాలబాలికలు, యువత 2కే రన్‌లో పాల్గొనాలని లక్ష్మణ్ కోరారు. 2కే రన్ అనంతరం మక్తల్ కేంద్రంలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో ఎన్‌సీసి పరేడ్ ఉంటుంది. దానితో పాటు ఎన్‌సీసి విద్యార్థులచే సాంస్కృతికకార్యక్రమాలు కూడా ఉంటాయని లక్ష్మణ్ తెలిపారు. పురప్రముఖులు, విద్యావేత్తలు, మాజీ సైనికులు, సామాజిక సేవకులు, విద్యార్థులు అత్యధిక సంఖ్యలో పాల్గొని77వ ఎన్‌సీసి ఆవిర్భావ దినోత్సవ ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని సిటివో లక్ష్మణ్ కోరారు.

## విహెచ్‌పి - భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో భగవద్గీత పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేసిన దృశ్యం

**ధన్వాడ, నవంబరు 21 ప్రభాతవార్త :** ధన్వాడ మండలంలోని భక్త మార్కండేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో మండల స్థాయి భగవద్గీత శ్లోకపఠన పోటీలు నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలకు చెందిన పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని భక్తి, భావపూర్వకంగా గీతా శ్లోకాలను ఆలపించారు. వారి శుద్ధోచ్చారణ, శ్రద్ధ, భగవద్గీతపై ఆసక్తి హాజరైన వారిని ఆకట్టుకుంది. విభాగాల వారీగా విజేతలు ఉన్నత స్థాయి:1వ బహుమతి: బి. నాగచైతన్య (శ్రీసాయి సరస్వతీ విద్యామందిర్) 2వ బహుమతి: నిహారిక (శ్రీసాయిసరస్వతీ విద్యామందిర్) మాధ్యమిక స్థాయి:1వ బహుమతి: మదశ్విని 2వ బహుమతి: కీర్తి ప్రాథమిక స్థాయి: 1వ బహుమతి: శ్రీనిధి 2వ బహుమతి: ఈ పోటీలకున్యాయనిర్ణేతలుగా ఎం.సుదర్శన్ (రిటైర్డ్ హెచ్‌ఎం)శివప్రసాద్ (ఆర్ఎస్ఎస్) మంగలి నర్సిములు (తెలుగు ఉపాధ్యాయులు) మంగలి సత్యనారాయ పాల్గొని విద్యార్థుల ప్రతిభను అభినందించారు. విజేతలకు బహుమతులను మరాఠి నారాయణ (నారాయణపేట విహెచ్‌పి జిల్లా ఉపాధ్యక్షులు), జుట్ల సుదర్శన్ (హిందూ వాహిని జిల్లా అధ్యక్షులు) కెంచె భాస్కర్, కుమ్మరి కురుమన్న, కావలి రవికుమార్ (ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహ), విజయ భార్గవ్, గౌరి శంకర్, వీరేష్ గౌడ్, మొల్కమోళ్ల బాలకృష్ణ గౌడ్, జుట్ల కళ్యాణ్, బోడ కురుమూర్తి ప్రదానం చేశారు. భగవద్గీత సారాన్ని చిన్న వయస్సు నుంచే నేర్చుకోవాలని, గీతా జ్ఞానం వ్యక్తిత్వ వికాసానికి దోహద పడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థి జన్మదినోత్సవం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

**ఊట్కూర్, నవంబరు 21 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండల పరిధిలోని వల్లంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థి బాలకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా, ఆయన తల్లిదండ్రులు యానగుంది కమలమ్మ-తిప్పన్న దంపతులు అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల విద్యార్థులందరికీ తిథి భోజనాన్ని ఏర్పాటు చేశారు. పిల్లలందరికీ చికెన్ వంటకాలు వడ్డించడంజరిగింది. ప్రత్యేక సందర్భాల్లో పాఠశాల విద్యార్థులకు అందించే అదనపు భోజనాన్నే తిథి భోజనంగా పిలుస్తారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయుడు సత్యపాల్, అంగన్‌వాడి టీచర్లు శిరీష, సావిత్రి, వంట ఏజెన్సీ నిర్వాహకురాలు మనెమ్మ, జయ పాల్గొన్నారు.